Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు, చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు, ఊట్కూర్ మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు


జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :251 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శనివారం 03 జనవరి 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


## బీఆర్ఎస్ విధానం ఫాలో అవ్వనున్న కాంగ్రెస్

హైదరాబాద్, జనవరి 2:తెలంగాణ అసెంబ్లీలో అధికార పార్టీతో పాటు తమకూ పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. లేకపోతే అన్యాయమని ఆరోపణలు చేస్తోంది. అది అన్యాయమా కాదా అన్నది ప్రజలు నిర్ణయిస్తారు కానీ.. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రతిపక్షాలను ఎంత మేర పరిగణనలోకి తీసుకుంది.. వారి వాయిస్ కు ఎంత మేర అవకాశం కల్పించిందన్నది గుర్తు చేసుకుంటే .. బీఆర్ఎస్ పార్టీ తాము విపక్షానికి ఎప్పుడూ ఇవ్వని కించిత్తు గౌరవాన్ని తాము భారీగా కోరుకుంటోంది.బీఆర్ఎస్ హయాంలో అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి గడ్డు పరిస్థితులు



ఎదురయ్యాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు కాంగ్రెస్ నేతలకు తగిన సమయం ఇచ్చేవారు కాదు. చిన్న చిన్న కారణాలతో సస్పెన్షన్లు చేయడం, మైకులు కట్ చేయడం వంటి ఘటనలు అప్పట్లో నిత్యకృత్యంగా ఉండేవి. సభలో చర్చల కంటే ఏకపక్ష నిర్ణయాలకే ప్రాధాన్యత ఉండేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు తగిన సమయం ఇస్తూ చర్చలకు వేదికగా అసెంబ్లీని మారుస్తున్నారు.దానికి ఇప్పటి వరకూ సాగిన అసెంబ్లీ తీరే సాక్ష్యం అనుకోవచ్చు.2016లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులపై అసెంబ్లీలో - మిగతా3లో

## హైదరాబాద్ శివారులో దట్టమైన పొగమంచు..

స్తంభించిన ట్రాఫిక్

శివారు ప్రాంతాలను కమ్మేసిన దట్టమైన పొగమంచు

ముందు వెళ్లే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డ డ్రైవర్లు

శంషాబాద్ హైవేపై 10 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్

విజయవాడ జాతీయ రహదారిపై లైట్ల వెలుతురులో వాహనాల రాకపోకలు

హైదరాబాద్:హైదరాబాద్ శివారు ప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ - మిగతా3లో



## కవితకు ఓటు... ఎవరికి చేటు...

హైదరాబాద్, జనవరి 2:తెలంగాణ రాజకీయాల్లో 2026 సంవత్సరం సరికొత్త సమీకరణాలకు వేదిక కాబోతోంది. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ లేదా బీజేపీ కంటే కూడా సొంత ఇంటి నుంచే వచ్చే ముప్పు అతి పెద్ద సవాల్‌గా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెట్టడం ఖాయమయింది. తెలంగాణ ఉద్యమ కాలం నుండి తెలంగాణ జాగృతి ద్వారా సాంస్కృతిక సారథిగా కవితకు ప్రత్యేక గుర్తింపు ఉంది. బీఆర్ఎస్ పార్టీలో - మిగతా3లో



## అగ్గిరాజేస్తున్న నీళ్లు....

హైదరాబాద్, జనవరి 2:పోలవరం బనకచర్ల లింక్ కెనాల్ అంశం రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి అగ్గిరాజేసింది. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లించే ఈ ప్రతిపాదనపై కేంద్ర జల సంఘం (అచిఅ) అనుమతులు ఇచ్చిందన్న ప్రచారం, అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి తెరలేపింది.ఈ తాజా వివాదానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన సంచలన వ్యాఖ్యలే కారణం. పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కు లింక్ ఏర్పాటు చేయడానికి సీడబ్ల్యూసీ పచ్చజెండా ఊపిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని, కేంద్రం వద్ద



తెలంగాణ వాణిని బలంగా వినిపించలేకపోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, అందుకే ఈ ప్రాజెక్టు అనుమతులపై మౌనంగా ఉన్నారని ఆరోపించారు.ఈ లింక్ ద్వారా గోదావరి నీళ్లను కృష్ణా ఆయకట్టుకు తరలిస్తే, భవిష్యత్తులో తెలంగాణకు గోదావరి జలాల్లో దక్కాల్సిన న్యాయమైన వాటా కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.హరీశ్ రావు ఆరోపణలను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంతే తీవ్రంగా తిప్పికొట్టారు. అసలు అనుమతులే రాలేదని స్పష్టం చేస్తూ ప్రభుత్వం తరపున వాస్తవాలను వినిపించారు. సీడబ్ల్యూసీ పోలవరం బనకచర్ల అనుసంధానానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, - మిగతా3లో



## బీసీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలు

కుల సంఘాల నేతలలో చర్చలు

మంత్రి పొన్నం

హైదరాబాద్:బీసీ కులాల ఆత్మగౌరవ భవనాలకు సంబంధించి త్వరలోనే నిర?యం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నాడు శాసనమండలిలో ఎమ్మెల్సీ బండ ప్రకాష్ అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం సమాధానం ఇచ్చారు.మంత్రి మాట్లాడుతూ 42 భవనాలకు స్థలాలు ఇచ్చారు కానీ దాని అభివృద్ధి చేయడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. మూడు భవనాలు పని ప్రారంభం అయి మధ్యలో ఉన్నాయి. కులాలకు సంబంధించిన ప్రతినిధులు ఆ స్థలాలు ప్రైవేట్ వ్యక్తుల చేతులకు పోకుండా కాపాడుకోవాలని అన్నారు.కురుమ భవనం పూర్తయిన ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ఇతర హాస్టల్ అవసరాలకు వాడాలని వారికే విబేధాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి చాంపియన్. బీసీ ప్రజా ప్రతినిధుల తో శాసన సభ సమావేశాల్లోపు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం.బీసీ సబ్ ప్లాన్ పై గత సంవత్సరం ప్రారంభించాలనుకున్నాము ఆ నిధులు వాడతాం.బలహీన వర్గాల విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇటీవల జరిగిన సర్వే లో అభివృద్ధి చెందిన కుటుంబాల నివేదిక పరిశీలిస్తే ఏ కుటుంబంలో అయితే ఉన్నత చదువులు ఉన్నాయో వారే అభివృద్ధి చెందారు. బలహీన వర్గాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతామని అన్నారు.

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్..

హైదరాబాద్:శుక్రవారం నాడు తిరిగి ప్రారంభమయిన అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. ముఖ్య మంత్రిని విమర్శించేందుకు మైక్ ఇవ్వనని స్పీకర్ గడ్డం ప్రసాద్ తేల్చిచెప్పారు. ఈ క్రమంలో మూసీపై సీఎం రేవంత్ మాట్లాడిన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని నిరసన తెలుపుతూ వాకౌట్ చేశారు.

## బీఆర్ఎస్ నేతల కడుపుల్లోనే విషం ఉంది

మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 02: కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు.మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా



ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 - మిగతా3లో

## వీవీఐపీలకే దేవుడా...!

తిరుమల, జనవరి 2:దేవుడి దర్శనంలో ఒక కొత్త ట్రెండ్ కనిపిస్తోంది. అర్జెంటుగా వెళ్లి దేవుడికి నమస్కారం చేయాలి. తనివి తీర దర్శనం చేసుకోవాలి. మనం అడిగే కోర్కెలను దేవుడు మన్నించేయాలి. ఎక్కువమంది ఆలోచన



ఇదే. దీనినుంచి పుట్టుకొచ్చింది వీఐపీ తనం. గ్రామంలో ఉండే చిన్న గుడి నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు ఈ వీఐపీ సంస్కృతి పెరుగుతూనే ఉంది. భారీగా డొనేషన్లు ఇచ్చారని.. లేకుంటే పాలనలో బిజీగా ఉండేవారు వీఐపీలుగా మారుతున్నారు. అటువంటి వారు వస్తే వేలాదిమంది దర్శనాలు నిలిపివేసి వారికి అవకాశం కల్పిస్తున్నారు. అయితే - మిగతా3లో

## జల వివాదాల పరిష్కారానికి కేంద్రం సంపూర్ణ సహకారం

: కిషన్‌రెడ్డి

ఢిల్లీ, జనవరి2 : జల వివాదాల పరిష్కారానికి కేంద్రప్రభుత్వం సంపూర్ణ సహకారం అందజేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఓ కమిటీని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఆ కమిటీని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ నోటిఫై చేసిందని తెలిపారు. కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా తెలుగురాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు ఉన్నారని వివరించారు. ఈ కమిటీలో ఐఖీఓః, ఉఖీఓః చైర్మన్లు, చీఫ్ ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు కిషన్‌రెడ్డి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీజలాల వినియోగంలో నెలకొన్న వివాదాల పరిష్కారానికి సంబంధించిన కమిటీని ఇవాళ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నోటిఫై చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సహకార సమాఖ్య విధానంతో.. గత 11 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాల పరిష్కారానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని చెప్పుకొచ్చారు. ఇందుకోసం ప్రత్యేకమైన వేదికలను ఏర్పాటుచేసి సమన్వయంతో సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**కృష్ణాజలాల వినియోగంపై వాదనలు..**

ఉదాహరణకు.. కృష్ణానది జల వివాద పరిష్కారానికి 6 అక్టోబర్ 2023నాడు ఐచిఊ-2ను (ఐతీతిబష్ట్రనిజీ చిజీబివతీ ఆతిబజూబీబివ ుతీతిఎబీనిజీశ్రీ) ఏర్పాటుచేసి.. అడిషనల్ టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌ను నిర్దేశించింది. రెండేళ్ల కాల వ్యవధి 1 ఆగస్టు, 2025 నాడు ముగిసింది. కృష్ణాజలాల వినియోగంపై వాదనలు నడుస్తోండటంతో దీన్ని మరో ఏడాది (31 జూలై, 2026) పొడిగిస్తూ



నిర్ణయం తీసుకుంది. ఇలా తెలుగు రాష్ట్రాల జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సహకరిస్తోంది.కాగా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని చాప్టర్ 9, సెక్షన్ 84 ప్రకారం.. - మిగతా3లో

# సంపాదకీయం

# ప్రజాస్వామ్యం పరిఢవిల్లేనా?

ప్రజాస్వామ్య సౌధం నాలుగు స్తంభాలపై నిలిచి ఉంది. చట్టసభలు, కార్యనిర్వాహక శాఖ, న్యాయ వ్యవస, మీడియా. ఈ నాలుగు స్తంభాలలో ముఖ్యమైన చట్టసభలకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరపవలసిన బాధ్యత ఎన్నికల కమిషన్, ప్రభుత్వాలదే. ముఖ్యంగా లోక్‌సభ శాసనసభలకు ఐదేళ్లకొకసారి లేదా కాస్త ముందుగా గాని ఎన్నికలు నిర్వహిస్తుండగా మిగిలిన స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారు. ఐదేళ్లు నిండిన తర్వాత వీటికి ప్రత్యేక అధికారులు నియమించి పాలన సాగిస్తున్నారే కానీ ఏదో ఒక కుంటిసాకుతో వాటికి ఎన్నికలు జరపడం లేదు. ఫలితంగా వాటికి రావలసిన కేంద్ర నిధులు విడుదల కాక అభివృద్ధి పడకేస్తున్న పరిస్థితి నెలకొంది. ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు ఎక్కడలేని ఉత్సాహం వస్తుంది. ఏదో విధంగా అబద్ధపు ప్రచారాల తోనూ, అలవికాని హామీలతోనూ ఓటర్లను ఆకర్షించవచ్చు. తమ ఓటు షేర్ పెంచుకునే ప్రయత్నం చేయవచ్చు. అధికార పక్షం బలప్రదర్శనకు, అంతో ఇంతో అధికార దుర్వినియోగానికి మంచి అవకాశం. కాగా ప్రతిపక్షాలకు విమర్శల బాణాలు సంధించడానికి, అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే దానికి సువర్ణ అవకాశం. పోటీ చేసే అభ్యర్థులకు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుండి ఫలితాల ప్రకటన వరకు గొప్ప టెన్షన్. తెగించి ఖర్చు చేస్తున్నా అందుకు అనుకూలమైన ఫలితం వస్తుందో లేదో అన్న ఆందోళన వారిని ఆవహించి ఉంటుంది. ఎన్నికల కమిషన్ కంటపడకుండా ఖర్చు చేయాలి. అందరినీ 'సంతృప్తి' పరచుకుంటూ పోవడం అతడికి అత్యవసరం. ఈ మహా ప్రక్రియలో చివరి బకరా ఓటరు. ఆశించి భంగపడటం అతడి నైజం. అందుకే ఈ మధ్య అభివృద్ధి జరుగుతుందని, తమ జీవితాలు బాగుపడతాయని సగటు ఓటరు విశ్వసించడం లేదు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఇచ్చే సొమ్మునే ఆశిస్తున్నాడు, దానికి ఆశపడుతున్నాడు. మన వ్యవస్థలో ఎన్నికల అక్రమాలు, నిబంధనల అతిక్రమణ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. పోటీ అభ్యర్థులను బెదిరించడం, లొంగదీసుకునే ప్రయత్నం చేయడం, కొంతమంది అభ్యర్థులతో లోపాయకారి ఒప్పందాలు నేటి ఎన్నికల ప్రక్రియలో భాగమయ్యాయి. ముఖ్యంగా ఎన్నికల ముందు రోజు జరిగే అక్రమాలకు, దుర్మార్గాలకు అంతులేకుండాపోయింది. పోలింగ్‌నాడు కూడా ఓటరుకు తన ఓటు తాను వేసేంతవరకు నమ్మకం లేదు. అంటే ప్రతిచోట ఎన్నికల ప్రక్రియ అపహాస్యం అవుతుండగా ప్రజాస్వామ్యంపై విశ్వాసం సన్నగిల్లుతున్నది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారుతున్నది. జాతీయ స్థాయిలో కార్పొరేట్లు తమకు అనుకూలమైన ప్రభుత్వాల కోసం వందల వేల కోట్లు పార్టీలకు విరాళాలు ఇస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నాయి. గతంలో పెద్ద పదవులకు అంటే ఎంపి, ఎంఎల్ఏ లాంటి వాటికి విదేశాలలో ఉన్న వారు సైతం దేశానికి వచ్చి ఏదో ఒక పార్టీ టికెట్ సంపాదించి పోటీ చేయడం పదవులు అనుభవించడం మనకు అనుభవమే. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు అభ్యర్థులు విదేశాల నుండి 'దిగుమతి' అవుతున్నారు. కొంతమంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి లేదా పదవి విరమణ చేసి మరీ ఈ సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేశారు. అంటే వారికి 'సేవా తత్పరత' ఎక్కువవుతున్నది. మాతృభూమిని అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్నట్లు వారు చెప్పుకోవడం సంతోషమే. కానీ అది ఐదేళ్ల తర్వాత ఆ గ్రామ ప్రజలు ఇవ్వవలసిన తీర్పు మాత్రమే. మన దగ్గర మహిళా అభ్యర్థులు పదవులకు ఎంపికైనా కానీ వారి 'మగమహారాజు'లే పరిపాలిస్తుంటారు. అనధికార పరిపాలకులుగా చలామణి అవుతుంటారు. పదవులు మహిళలకు, అధికారాలు వారి భర్తలకు. కొన్ని సందర్భాలలో సమావేశాలకు సైతం వారి భర్తలే హాజరై చర్చల్లో పాల్గొంటూ నిర్ణయాత్మక శక్తిగా వ్యవహరించడం శోచనీయం. మాటల్లోని మహిళాభ్యున్నతి గడప దాటడం లేదు. తరతరాలుగా జీర్ణించుకొని పోయిన పురుషాధిక్యం సమాజంలో మహిళలకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పరచుతూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. కొన్నిచోట్ల దళిత గిరిజన సర్పంచులపై ఆ గ్రామంలోని ఆధిపత్య కులాలు తమ పెత్తనం చెలాయిస్తుండటం చూస్తూనే ఉన్నాం. కొంతమంది మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు తమ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఇతర నియోజకవర్గాలను చిన్నచూపు చూస్తారు లేదా నిర్లక్ష్యం చేస్తారు. వీరు రాష్ట్రం మొత్తానికి లేదా దేశం మొత్తానికి బాధ్యులు అనే విషయం మరవడం బాధాకరం. పదవి స్వీకారం నాడు ఏ వ్యక్తికి, ప్రాంతానికి అనుచితంగా లేదా పక్షపాతంతో వ్యవహరించబోమని దైవసాక్షిగా ప్రమాణం చేస్తారు. ప్రజలు ప్రశ్నించడం మానుకున్నారు. ప్రశ్నించిన వాడి ఉనికి ప్రశ్నార్థకమవుతున్నది. అందుకే అవినీతికి అంతులేకుండా పోతున్నది. న్యాయం అందడానికి, పొందడానికి కాలము, డబ్బు ఖర్చవుతున్నాయి. సామాన్యుడి సహనానికి పరీక్షగా మారింది. రాజకీయాలలో డబ్బు జోక్యం ఎక్కువైంది. అందుకే గతంలో లాయర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, మేధావులు, సంఘ సంస్కర్తలు రాజకీయాలు నడపగా నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మద్యం వ్యాపారులు, నేరచరితులు రాజకీయాలను ఆక్రమించారు, విలువలను పాతరేశారు. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా రాజకీయాల పట్ల ఆకర్షితులవుతున్నారే కానీ వాటిని ప్రక్షాళన చేయలేకపోతున్నారు. అందులో విజయం సాధించలేకపోతున్నారు. రేపటి తరానికి దిశానిర్దేశం చేయలేకపోతున్నారు. రాజకీయ నాయకులకు, ఉద్యోగులకు లాగా ఒక నిర్దిష్టమైన అర్హత లేకపోవడం ఈ వ్యవస్థ దురదృష్టం. ఓటుకు ఈసారి గిరాకీ మరీ పెరిగింది. దూరతీరాలలో ఉన్న వారు సైతం తమ సొంత ఊరుకొచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు అభ్యర్థుల ఖర్చుతో. ఒక పెద్ద మనిషి ప్రత్యేకించి విదేశాల నుండి విమానంలో విచ్చేసి తన హక్కును కాపాడుకొని ఓటు విలువ తెలియజేశాడు. నిన్నమొన్నటి ఎన్నికలలో ఒకచోట ఒక ఓటు విలువ 40 వేలు పలికినట్లుగా చదివాం. కొన్ని చోట్ల కోట్లు చేతులు మారుతున్నట్టుగా చదువుతున్నాం. అంతో ఇంతో ఈ దేశంలో ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టిన టిఎన్ శేషన్ సదాస్మరణీయుడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశంలో జిల్లాకు ఒక శేషన్ కూడా సరిపోడేమో! ఆ పిల్లిమెడలో గంటకట్టేది ఎవరో? ఆశగా ఎదురు చూద్దాం. ఇక గ్రామాల్లో శాంతి నెలకొంటుందని, అవి అభివృద్ధి పథంలో సాగుతాయని కోరుకుందాం.

## హైదరాబాద్ ను ప్రపంచస్థాయి నగరంగా

# తీర్చిదిద్దాలనేదే మా సంకల్పం...

**అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్:** ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ఇప్పటికీ హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. ఆగర్భ శ్రీమంతుల ఫామ్ హౌజుల డ్రైనేజీతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లొంకలుపుతుంటే ఉక్కు పాదం మోపామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడారు. రేవంత్ మాట్లాడుతూ మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ అస్థికలు కలిపిన చోట బాపూ ఘాట్ నిర్మించారు. మానవ నాగరికత నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి చెందింది. కాకతీయుల నుంచి నిజాం నవాబుల వరకు సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా ప్రాజెక్టులు నిర్మించారు. 1908 లో నగరాన్ని వరద ముంచెత్తితే, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిజాం సర్కారు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులను నిర్మించింది. మూసీ నది ప్రక్షాళనపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కి తగ్గకుండా ముందుకు వెళ్లాం. లండన్ థేమ్స్ రివర్, న్యూయార్క్ జపాన్, సౌత్ కొరియా, సింగపూర్ లాంటి దేశాలను పర్యటించాం . ప్రపంచస్థాయి నగరాలన్నీ నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకున్నాయి . గుజరాత్ సబర్మతీ నది ప్రక్షాళన సమయంలో 60 వేల కుటుంబాలను తరలించారు. ఉత్తర్ ప్రదేశ్ లో గంగా నది ప్రక్షాళన చేసి రివర్ ఫ్రంట్ కట్టుకున్నారు. బీజేపీ నాయకులు వాటిని అభివృద్ధి మంత్రంగా ప్రచారం చేసుకున్నారు. మేం వాటిని వ్యతిరేకించలేదు. తప్పుపట్టడం లేదు. మూసీ కాలుష్యం కారణంగా నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. కంపెనీల కలుషితాల నుంచి జంతువుల కళేబరాల వరకు మూసీలో కలుస్తున్నాయి.. మూసీ పరీవాహక ప్రాంత మహిళలు గర్భం దాల్చలేకపోతున్నారని వైద్యులు చెప్పిన పరిస్థితి వుంది. ప్రపంచ నగరాలు అభివృద్ధి చెందుతున్న విధానాలను చూశాక మూసీలో శుద్ధమైన నీరు ప్రవహించాల్సిందేనని ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం . కన్సల్టెన్సీలను అపాయింట్ చేసుకుని మూసీ ప్రక్షాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పామని అన్నారు. బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ రెండు నదులు కలిసే చోట వి షేప్ లో అభివృద్ధి జరుగుతోంది. గోదావరి జలాలను తరలించి మూసీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనుకుంటున్నాం. 20 ఒఓఅ లలో 15 టీఎంసీలు తాగు నీటి అవసరాలకు, 5 టీఎంసీలు మూసీ లో నిరంతరం శుద్ధమైన నీరు పాటించేందుకు ఉపయోగించాలనుకుంటున్నాం. మూడు నదుల సంగమంగా బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ను అభివృద్ధి చేయబోతున్నాం . మార్చి 31 లోగా అంచనాలు సిద్ధం చేసి టెండర్లు వేసి అభివృద్ధి చేయాలనుకుంటున్నాం. ఏడీబీ బ్యాంకు రూ. 4 వేల కోట్లు రుణం ఇచ్చేందుకు అంగీకరించింది . గాంధీ సరోవర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతించింది. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని భావిస్తున్నాం. ఓల్డ్ సిటీని మేం ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. ఓల్డ్ సిటీ ఒరిజినల్ సిటీ.. ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం. కొంతమంది నన్ను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారు . రియల్ ఎస్టేట్ కూడా ఒక ఇండస్ట్రీ. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారు . రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుంది . రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుంది. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరం . నేను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారు . నిజాలు ప్రజలకు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన చేయాలని వాళ్ల బీఆరెస్ ఎమ్మెల్యేలు కూడా కోరుతున్నారు . మూసీ పరీవాహక ప్రాంత పేదలకు మెరుగైన వసతులు కల్పిస్తామంటే వాళ్లు అలాగే ఉండాలన్నట్లుగా విపక్షం ప్రవర్తిస్తున్నది. మంచిరేవుల దగ్గర మూసీ పరివాహకంలో ఉన్న పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయబోతున్నాం. మూసీ పరివాహకంలో గురుద్వార్ , మసీదు, చర్చి లను నిర్మించి మత సామరస్యాన్ని చాటబోతున్నాం. డీపీఆర్ సిద్ధమయ్యాక అందరి సలహాలు, సూచనలు తీసుకుంటాం. గాంధీ సరోవర్ నిర్మాణానికి డిఫెన్స్ ల్యాండ్ ఇవ్వడానికి కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ గారు సూచనప్రాయంగా అంగీకరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు నా సూచన . మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పండి . పేదలకు మంచి ఇండ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దాం . హైదరాబాద్ ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే మా సంకల్పం . మేం మంచి పని చేయాలనుకుంటున్నాం? మీ సూచనలు సలహాలు ఇవ్వండని అన్నారు.

# అసలు మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారు

**వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలి**

**కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ**

**హైదరాబాద్ జనవరి 2:**;మూసీ ప్రక్షాళనతో నిరుపేదల బతుకులు చితికిపోవద్దని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. అసలు మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారని ప్రశ్నించారు. వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ ప్రక్షాళనపై జరిగిన చర్చలో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన వికారాబాద్ నుంచి చేస్తారా? మధ్యలో నుంచి చేస్తారా అని ప్రశ్నించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉందని అడిగారు. ప్రపంచంలో కాలుష్యంలో మూసీ 8వ స్థానంలో ఉందని తెలిపారు. మూసీ ? ఈసా నదులు కావు.. అవి ఇప్పుడు సీవరేజ్ ప్లాంట్లు అని అక్బరుద్దీన్ విమర్శించారు. నగరంలోని మురుగు అంతా మూసీ నదిలోకే వెళ్తోందని తెలిపారు. గండిపేట జలాశయంలో కూడా మురుగు నీరు కలుస్తుందని అన్నారు. దశాబ్దాల కింద నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో పూడిక తీసి, వాటి సామర్థ్యం పెంచాలని కోరారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచితే గోదావరి జలాలను తరలించవచ్చని తెలిపారు. చార్మినార్ వద్ద మూడేళ్ల కిందట మొదలుపెట్టిన పెడస్ట్రేరియన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు.

# 40 శాతం పెరగనున్న సిగిరెట్ ధర



**ముంబై, జనవరి 2:**సిగరెట్ తాగే వారికి ఇది బ్యాడ్ న్యూస్ అని చెప్పాలి. ఇకపై సిగరెట్ తాగాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందేమో. లేదా సిగరెట్ తాగడం ఆపేయాలి. ఎందుకంటే సిగరెట్ ధరలు భారీగా పెరగనున్నాయని తెలుస్తోంది. ఎక్సైజ్ డ్యూటీ పెంచి సిగరెట్లను కొనలేనంత భారం చేయడానికి కేంద్రం సిద్ధమవుతోందట. అదే జరిగితే సిగరెట్ రేట్లు భగ్గుమనడం ఖాయం. అంటే.. ప్రస్తుతం 18 రూపాయలుగా ఉన్న ఒక్క సిగరెట్ ధర త్వరలో 72 రూపాయలకు పెరగొచ్చని అధికారులు చెబుతున్నారు. సిగరెట్ల వినియోగాన్ని తగ్గించడానికి తీసుకుంటున్న చర్యలు సతాలితాలు ఇవ్వడం లేదట. దీంతో రేట్లు పెంచేందుకు సెంట్రల్ ఎక్సైజ్ (అమెండ్‌మెంట్) బిల్-2025లో కేంద్రం ప్రపోజల్స్ పెట్టింది. పార్లమెంటు.. కేంద్ర ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025కు ఆమోదం తెలిపిన తర్వాత దేశంలో సిగరెట్ల ధరలు భారీగా పెరగనున్నాయి. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ప్రవేశపెట్టిన ఈ బిల్లు.. సిగరెట్లు, సిగార్ల నుండి హుక్కా, నమలబడే పొగాకు వరకు అనేక రకాల పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాలను సవరిస్తుంది. ప్రస్తుతం సిగరెట్ల పొడవు, రకాన్ని బట్టి ప్రతి 1,000 సిగరెట్ల ప్యాక్ పై రూ. 200 నుండి రూ. 735 వరకు సుంకం విధించబడుతోంది. తాజా సవరణ ప్రకారం ఆ సుంకం 2వేల 700-11వేల రూపాయలకు పెరగనుంది. నమిలే పొగాకు(చీవింగ్ టొబాకో)పై సుంకాలు 25% నుండి 100%కి అంటే నాలుగు రెట్లు పెరుగుతాయి. హుక్కా పొగాకుపై సుంకాలు 25% నుండి 40%కి పెరుగుతాయి. ధూమపాన (స్మోకింగ్) మిశమాలపై సుంకాలు 60% నుండి 300%కి అంటే 5 రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఓవరాల్ గా చూస్తే.. ప్రస్తుతం రూ. 18 ఉన్న సిగరెట్ ధర త్వరలోనే రూ. 72 వరకు చేరొచ్చని అధికారుల అంచనా. ఈ పెంపు ఆన్‌లైన్‌లో మిశ్రమ స్పందనలకు దారితీసింది. "నేను ధూమపానం చేసేవాడిని కాబట్టి, నేను ఈ నిర?యం ఇష్టపడుతున్నాను. నేను కూడా దీన్ని మానేయొచ్చు" అని ఒక రెడ్డిట్ యూజర్ కామెంట్ చేశాడు. "ధూమపానం చేసే వారు నిరాశకు గురవుతున్నారు. ఈ మార్పు మనలో చాలా మందిని ప్రభావితం చేయదు" అని మరో యూజర్ అన్నాడు. కొందరు దీన్ని ప్రభుత్వ అతిక్రమణగా భావించారు. "నేను ఈ 'బిగ్ బ్రదర్' విధానాన్ని ద్వేషిస్తున్నా" అని ఒక యూజర్ అన్నాడు. ఇంతలో, మరికొందరు "బీడీ పీనే కా టైమ్ ఆగయా హై", "మై తో ఢిల్లీ కి హవా మే జీ లేతా హు.. ఫ్రీ ఫ్రీ ఫ్రీ" అని స్పందించారు.

## 39 దేశాల నుంచి

# అమెరికాకు ఎవరూ వెళ్లలేరు



**న్యూఢిల్లీ, జనవరి 2:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర?యం తీసుకున్నారు. 2026 జనవరి 1వ తేదీ నుండి అమలులోకి వచ్చేలా మొత్తం 39 దేశాలపైలిలి ప్రయాణ నిషేధాన్ని విధిస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడటం , ఉగ్రవాద ముప్పులను అడ్డుకోవడమే లక్ష్యంగా అధ్యక్షుడు ట్రంప్ ప్రయాణ ఆంక్షల జాబితాను భారీగా పెంచారు. 2025 జూన్‌లో 19 దేశాలపై ఉన్న ఆంక్షలను ఇప్పుడు 39కి విస్తరించారు. అక్రమ వలసలను అరికట్టడం, వీసా నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర?యం తీసుకున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. జనవరి 1, 2026 ఉదయం 12:01 గంటల నుండి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఈ ఉత్తర్వులను ప్రభుత్వం రెండు భాగాలుగా విభజించింది. 19 దేశాలపై పూర్తి నిషేధం ఉండగా, మరో 20 దేశాలపై పాక్షిక నిషేధం అమలు చేస్తున్నారు. పూర్తి నిషేధం ఉన్న దేశాల పౌరులు ఎటువంటి వీసాలపై అమెరికాలో అడుగుపెట్టలేరు. పాక్షిక నిషేధం ఉన్న దేశాల పౌరులకు ఇమ్మిగ్రెంట్ వీసాలు, పర్యాటక (%దీ-1/దీ%-2), విద్యార్థి (%ఖీ, వీ, జీ%) వీసాల జారీని నిలిపివేశారు.

పూర్తి నిషేధం (19 దేశాలు ం పాలస్తీనా):
ఆఫ్ఘనిస్థాన్, బుర్కినా ఫాసో, బర్మా (మయన్మార్), చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లావోస్, లిబియా, మాలి, నైజర్, సోమాలియా, సౌత్ సూడాన్, సూడాన్, సిరియా, యెమెన్, సియెర్రా లియోన్ , పాలస్తీనా అథారిటీ జారీ చేసిన డాక్యుమెంట్లు ఉన్నవారు.

**పాక్షిక నిషేధం (20 దేశాలు):**
అంగోలా, ఆంటిగ్వా బార్బుడా, బెనిన్, బురుండి, కోట్ డి ఐవరీ, క్యూబా, డొమినికా, గాబన్, గాంబియా, మలావి, మౌరిటానియా, నైజీరియా, సెనెగల్, టాంజానియా, టోగో, టోంగా, తుర్క్మెనిస్తాన్, వెనిజులా, జాంబియా, జింబాబ్వే. ఈ ఆంక్షలు కేవలం కొత్తగా వీసా పొందే వారికి మాత్రమే వర్తిస్తాయి. ఇప్పటికే చెల్లుబాటు అయ్యే వీసాలు కలిగి ఉన్నవారికి, గ్రీన్ కార్డ్ హోల్డర్లకు , ప్రస్తుతం అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న వారికి ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది. అలాగే దౌత్యవేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, , అత్యవసర మానవతా కారణాలతో వచ్చే వారికి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అనుమతి లభించే అవకాశం ఉంది. ఈ నిర?యం వల్ల ముఖ్యంగా ఆఫ్రికా , మధ్యప్రాచ్య దేశాల నుండి వచ్చే లక్షలాది మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. 2026లో అమెరికా వేదికగా జరగనున్న ప్రపంచ కప్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు క్వాలిఫై అయిన సెనెగల్, కోట్ డి ఐవరీ వంటి దేశాల అభిమానులకు కూడా ఇది ఇబ్బందిగా మారనుంది.

వార్తాతరంగాలు



# అగ్గిరాజేస్తున్న నీళ్లు...

- మొదటి పేజీ తరువాయి

హరీశ్ రావు రాజకీయ లబ్ధి కోసమే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివాదం ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణలో ఉందని, కోర్టు పరిధిలో ఉన్న అంశంపై కేంద్ర సంస్థలు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేవని మంత్రి గుర్తుచేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే జల దోపిడీ జరిగిందని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎదురుదాడి చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.రాజకీయ విమర్శలను పక్కనపెడితే, ఈ ప్రాజెక్టు సాంకేతికంగా రెండు రాష్ట్రాలకూ కీలకమైనది. పోలవరం కుడి కాలువ ద్వారా వచ్చే గోదావరి నీటిని, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు (శ్రీశైలం కుడి గట్టు కాలువ, తెలుగు గంగ తదితర) మళ్లించడం ఏపీ లక్ష్యం. దీనివల్ల కృష్ణా నదిలో నీటి లభ్యత లేనప్పుడు, గోదావరి జలాలతో రాయలసీమను ఆదుకోవచ్చని ఏపీ భావిస్తోంది. అయితే తెలంగాణ వాదన మరోలా ఉంది. బనకచర్ల అనేది కృష్ణా



బేసిన్‌లోని భాగం. గోదావరి జలాలను అక్కడికి మళ్లిస్తే, కృష్ణా జలాల్లో మిగులు జలాల లెక్కలు మారిపోతాయి. పోలవరం నుంచి మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలకు బదులుగా, కృష్ణా జలాల్లో ఎగువ రాష్ట్రాలకు అదనపు వాటా దక్కాలి. ఈ లెక్కలు తేలకుండా, ఏపీ ఏకపక్షంగా నీటిని మళ్లిస్తే, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల కింద ఉన్న తెలంగాణ ఆయకట్టు ఎండిపోయే ప్రమాదం ఉందనేది ఆ రాష్ట్రవాదన.అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం, ఏపీ ప్రభుత్వం ఈ లింక్ కెనాల్ కోసం డీపీఆర్ ను సీడబ్ల్యూసీకి సమర్పించిన మాట వాస్తవమే. అయితే, దీనిపై గోదావరి, కృష్ణా బోర్డుల అభిప్రాయాలను, తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా సీడబ్ల్యూసీ తుది అనుమతి ఇచ్చే అవకాశం తక్కువ. ప్రస్తుతం సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నందున, న్యాయపరమైన చిక్కులు లేకుండా కేంద్రం ముందడుగు వేయలేదు.ప్రస్తుతం పోలవరం ? బనకచర్ల అంశం ఒక పొలిటికల్ టూల్ గా మారింది. బీఆర్ఎస్ దీనిని సెంటిమెంట్ అస్త్రంగా వాడుకుని ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూస్తుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని సమర్థంగా తిప్పికొట్టే పనిలో పడింది. అయితే, రాజకీయ ఆరోపణలు ఎలా ఉన్నా, గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లించే విషయంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏ చిన్న ఏమరుపాటు ఉన్నా, భవిష్యత్ తరాలకు తీరని అన్యాయం జరిగే ప్రమాదం లేకపోలేదు.

# బీఆర్ఎస్ నేతల కడుపుల్లోనే విషం ఉంది

- మొదటి పేజీ తరువాయి

ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. జలవనరులను కలుషితం చేసి కబ్జాలు పెట్టి ఫాంహౌస్‌లు నిర్మించారని.. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారని మండిపడ్డారు. అందుకే ఆ డ్రైనేజీలను కూలగొట్టి.. కబ్జాలపై చర్యలు తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ



మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు.గతంలో గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60 వేల కుటుంబాలను మరో ప్రాంతానికి తరలించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యూపీలో గంగా నది ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారన్నారు. నది పరివాహక ప్రాంతాల అభివృద్ధిని బీజేపీ ఎన్నికల అజెండాగా మర్చిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించట్లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిపడ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామని చెప్పారు.మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ ప్రక్షాళన కన్సల్టెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచామన్నారు. 3 సంస్థల జాయించ్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ చేపడుతున్నట్లు వివరించారు. గోదావరి నుంచి 20 టీఎంసీలు నగరానికి తరలించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

# వీవీఐపీలకే దేవుడా...!

- మొదటి పేజీ తరువాయి

సాధారణ ప్రజలకు విఐపి లు కావచ్చు కానీ.. దేవుడు ముందు మాత్రం వీరు తక్కువే. అయితే ప్రజలకు తాము వీఐపీలమని చూపుతున్న వీరు.. దేవుడు ముందు మాత్రం తగ్గి ఉంటున్నారు. ఎందుకంటే అనుగ్రహించాల్సింది ఆయనే కాబట్టి. అయితే ఈ వీఐపీ సంస్కృతి ఇప్పుడు ప్రతి చోట పెరుగుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.దేవాలయం అనేది అహంకారం విడాల్సిన చోటు. అక్కడ అందరూ సమానమే. సామాన్యుల తో కలిపి గంటల తరబడి వేచి చూస్తే అక్కడ సహనం, సమయం విలువ తెలుస్తుంది. ప్రపంచంలో ఎంతటి పెద్ద ధనవంతుడైన, పదవిలో ఉన్నవారు అయినా దేవాలయానికి వస్తే దేవుడు దగ్గర యాచకుడు మాత్రమే. ఈ విషయాన్ని గుర్తించాలి. నిన్ననే ముక్కోటి ఏకాదశి పర్వదినం జరిగింది. ప్రతి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాలు జరిగాయి. ఉన్నది ఒకటే ద్వారం కానీ వీఐపీలు అనేకం. వేలాదిమంది సామాన్య భక్తులను ఇట్టే దాటుకొని స్వామివారిని వీఐపీ దర్శనం ద్వారా పూజలు చేసిన వారు చాలామంది ఉన్నారు. అయితే కొంతమంది క్యూలో నిలబడితే వచ్చే ఇబ్బందులు ఉన్నాయి. అటువంటి వీఐపీలు ప్రత్యేక దర్శనం ద్వారా వెళ్లిపోవచ్చు. కానీ అటువంటివారు కాకుండా గుర్తు పట్టని వీఐపీలు కూడా.. వేలాది మంది భక్తులను దాటుకుని వెళ్లి ప్రత్యేక దర్శనాలు చేసుకోవడం మాత్రం సామాన్యులకు ఇబ్బందికరమే.ఆయన దేవుడు.. మనం సేవకులం. మధ్యలో ఈ వీఐపీ సంస్కృతి ఏంటనేది ఒక వాదన. ఎందుకంటే దేవుడు ముందు అందరూ యాచకులే. అందరికంటే ముందు వెళ్లి అయ్యా నా కోరికల చిట్టా ఇది.. నా కష్టాలు ఇవి అని చెప్పుకుంటే దేవుడు తీరుస్తాడా? దేవుడికి అన్నీ తెలుసు. మన గుణగణాలు తెలుసు. అటువంటి దేవుడు తన మిగతా భక్తులను దాటుకొని వచ్చి.. కనీసం తన కోసం వేచి చూడకుండా.. సమయం ఇవ్వకుండా.. నేను వీఐపీని అంటూ ముందుకు వస్తే దేవుడు సహించగలడా? అనేది ప్రశ్న. ఇక్కడ



దేవుడు అనేది ఒక నమ్మకం. ఆ నమ్మకాన్ని నమ్మకమైన రీతిలో అనుసరించాలే కానీ. వీఐపీ సంస్కృతి భక్తిత్వం మాత్రం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. ఇది సాటి మనుషులకు ఇబ్బందులకు గురి చేయడమే.

# అసెంబ్లీలో పీపీటీ వార్

**హైదరాబాద్, జనవరి 2:**తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రాజకీయాలు ముదురుతున్నాయి. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలను ఎండగట్టేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో పీపీటీని ఒక అస్త్రంగా ఎంచుకుంది. ఇందుకు ప్రతిగా తాము చేసిన అభివృద్ధిని వివరించేందుకు తమకూ పీపీటీ ఇచ్చే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పట్టుబడుతోందిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంలో జరిగిన విధ్వంసం పై ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ప్రాజెక్టుల రీ-డిజైనింగ్, అదనపు ఖర్చు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వంటి అంశాలపై పక్కా ఆధారాలతో కూడిన పీపీటీని సభలో ప్రదర్శించేందుకు సిద్ధమైంది. సభ మధ్యలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసి, ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టడమే కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ పీపీటీకి దీటుగా సమాధానం చెప్పేందుకు బీఆర్ఎస్ కూడా సిద్ధమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఏకపక్షంగా తన వాదనను వినిపిస్తే సరిపోదని, ప్రధాన ప్రతిపక్షంగా తమ వెర్షన్ ప్రజలకు తెలియజేయడానికి తమకూ పీపీటీ చాన్స్ ఇవ్వాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఒకవేళ తమకు అవకాశం ఇవ్వకపోతే, గతంలో ఇలాగే అవకాశం నిరాకరించినప్పుడు ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభను బహిష్కరించిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు.అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పీపీటీ అంశం చర్చకు వచ్చింది. శీతాకాల సమావేశాల కాలాన్ని పెంచాలని, తమకు పీపీటీ అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ కోరగా.. స్పీకర్ ఆ వినతిని పరిశీలిస్తామని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పాత సంప్రదాయాలను తెరపైకి తెస్తోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పీపీటీలు ఇచ్చినప్పుడు ప్రతిపక్షాలకు ఎప్పుడూ అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు తాము కూడా అదే సంప్రదాయాన్ని పాటిస్తామని కాంగ్రెస్ మంత్రులు స్పష్టం చేస్తున్నట్లుగా తెలుస్తోంది.2016లో అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రాజెక్టులపై పీపీటీ ఇచ్చినప్పుడు, కాంగ్రెస్ కూడా తమకు అవకాశం ఇవ్వాలని అడిగింది. కానీ అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం నిరాకరించింది. ఇప్పుడు సీన్ రివర్స్ కావడంతో, అప్పుడు మీరు మాకు ఇవ్వలేదు.. ఇప్పుడు మేము మీకు ఇవ్వం అనే కాంగ్రెస్ వాదిస్తోంది. ఆ సంప్రదాయాన్ని పాటిస్తామని అంటున్నారు. తమకు అసెంబ్లీలో పీపీటీ చాన్స్ ఇవ్వకపోతే.. కాంగ్రెస్‌కు కౌంటర్ గా తెలంగాణ భవన్‌లో పీపీటీ ఇచ్చేందుకు హరీష్ రావు ప్రయత్నాలు చేస్తున్నారు.

## మహిళా ప్రయాణికులపై ఆర్టీసీ కండక్టర్ బూతు పురాణం

**హైదరాబాద్:**సామాన్య ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించాల్సిన ఆర్టీసీలో ఒక కండక్టర్ బరితెగించాడు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళల పట్ల అత్యంత అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, నోటికొచ్చినట్లు బూతులు తిడుతూ రెచ్చిపోయిన ఘటన కలకలం రేపుతోంది.హయత్ నగర్ డిపోకు చెందిన 218%౧% నంబర్ గల ఆర్టీసీ బస్సు (%౦+01౦%5653) లో ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో సదరు కండక్టర్ చిన్న కారణానికే వివాదానికి దిగాడు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన ఆయన, కనీస మర్యాద లేకుండా మహిళలను ఉద్దేశించి అత్యంత అసభ్య పదజాలంతో దూషించాడు. అందరూ చూస్తుండగానే మహిళలపై బూతులతో విరుచుకుపడటంతో ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు.ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటి నుండి కొన్ని చోట్ల కండక్టర్లు మహిళల పట్ల చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా జరిగిన ఈ ఘటనలో కండక్టర్ ప్రవర్తనపై తోటి ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతాయుతమైన ఉద్యోగం లో ఉండి మహిళలను అలా దూషించడం పట్ల సామాజిక మాధ్యమాల్లో సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా ఆర్టీసీ ఉన్నతాధికారుల ద ృష్టికి వెళ్లాయి.కండక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించేలా సిబ్బందికి కౌన్సెలింగ్ ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. మహిళల రక్షణ కోసం ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న ఆర్టీసీ యాజమాన్యం, ఈ ఘటనపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## బీఆర్ఎస్ విధానం ఫాలో అవ్వనున్న కాంగ్రెస్

- మొదటి పేజీ తరువాయి

సుదీర్ఘంగా పీపీటీ ఇచ్చారు. ఆ సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా తమ వాదనను ప్రజెంటేషన్ ద్వారా వినిపిస్తామని, తమకూ అవకాశం ఇవ్వాలని బతిమిలాడినా బీఆర్ఎస్ కనికరించలేదు. ప్రభుత్వానికి మాత్రమే ప్రజెంటేషన్ ఇచ్చే హక్కు ఉంది అని నాడు బీఆర్ఎస్ నేతలు కరాఖండిగా చెప్పారు. ప్రతిపక్షం అడిగిన ఏ ఒక్క



ప్రశ్నకూ ప్రజెంటేషన్ రూపంలో సమాధానం చెప్పే వీలు కల్పించకుండా కేసీఆర్ తన వాదననే ఏకపక్షంగా వినిపించారు. కానీ ఇప్పుడు మాత్రం తమకూ పీపీటీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.చిత్రమేమిటంటే, నాడు ప్రతిపక్షానికి ఏ అవకాశాన్నైతే నిరాకరించారో, నేడు అదే అవకాశాన్ని తమకు కల్పించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇవ్వనున్న పీపీటీకి కౌంటర్‌గా తాము కూడా ప్రజెంటేషన్ ఇస్తామని, తమకు ఆ హక్కు ఉందని స్పీకర్‌ను కోరుతున్నారు. నాడు ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన వారు, నేడు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఈ డిమాండ్ పై కాంగ్రెస్ నేతలంటున్నారు. బీఆర్ఎస్ ఒత్తిడిపై కాంగ్రెస్ ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉంది. గతంలో బీఆర్ఎస్ ఏ సంప్రదాయాన్ని పాటించిందో, తాము కూడా అదే బాటలో నడుస్తామని సంకేతాలు ఇస్తోంది. అప్పట్లో బీఆర్ఎస్ ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించి ఉంటే.. ఇప్పుడీసమస్యలు వచ్చేవి కావని అనుకోవచ్చు.

## హైదరాబాద్ శివారులో దట్టమైన పొగమంచు..

- మొదటి పేజీ తరువాయి

నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్లెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఫలితంగా శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు ఔటర్ రింగ్ రోడ్డు పై కూడా మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.మరోవైపు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద పది అడుగుల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించనంతగా పొగమంచు కురుస్తోంది. విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోవడంతో వాహనదారులు హెడ్ లైట్లు, ఇండికేటర్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఉషో?గ్రతలు మరింత తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## జల వివాదాల పరిష్కారానికి కేంద్రం సంపూర్ణ సహకారం

- మొదటి పేజీ తరువాయి

కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగానికి సంబంధించిన విషయంలో సమస్యల పరిష్కారం కోసం అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటైంది. 16, జూలై 2025 నాడు ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ (జల్‌శక్తి) మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో.. తెలంగాణ,



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న విషయం తెలిసిందే.ఈ సమావేశంలో.. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలను ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రస్తావించగా.. వాటిని చర్చించి, సాంకేతికతంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని అపెక్స్ కౌన్సిల్ నిర్ణయించింది. ఇందుకోసం ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయాలని సూచించింది. డిసెంబర్ 23, 2025 నాడు తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేయడంతో ఇవాళ (శుక్రవారం) కేంద్ర జలవనరుల సంఘం కొత్త కమిటీని నోటిఫై చేసింది.ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వం వహించనుంది. ఈ కమిటీలో తెలంగాణ నుంచి జలవనరుల శాఖ సలహాదారు, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ సభ్యులుగా ఉండగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి.. జలవనరుల శాఖ స్పెషల్ సెక్రటరీ, జలవనరుల శాఖ సలహాదారు, ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇరిగేషన్), చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉండనున్నారు. వీరితోపాటుగా.. కృష్ణానది యాజమాన్య బోర్డు హైదరాబాద్ చైర్మన్, గోదావరి నది యాజమాన్య బోర్డు (ఉఖీఓః) చైర్మన్లు, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఔచిఅం) చీఫ్ ఇంజనీర్, అచిఅ చీఫ్ ఇంజనీర్ కూడా సభ్యులుగా ఉండనున్నారు.

## కవితకు ఓటు... ఎవరికి చేటు...

- మొదటి పేజీ తరువాయి

మహిళా గళంగా ఆమె కీలకంగా వ్యవహరించారు. కారణాలు ఏమైనా ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆమె జాగృతి పేరుతో రాజకీయం చేస్తున్నారు. కానీ ఇంకా రాజకీయ పార్టీగా ప్రకటించలేదు. కొత్త ఏడాదిలో ఆమె సొంతంగా పార్టీని ప్రకటించి, మరింతగా క్షేత్రస్థాయిలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. అది బీఆర్ఎస్‌కు పరోక్షంగా పెనుగండంగా మారుతుంది. ఇది కేవలం రాజకీయ చీలిక మాత్రమే కాదు, కేసీఆర్ స్థాపించిన పార్టీకి నైతిక , సెంటిమెంట్ పరమైన దెబ్బగా పరిణమించే ప్రమాదం ఉందిరాజకీయాల్లో 1 లేదా 2 శాతం ఓట్ల వ్యత్యాసమే అధికార మార్పిడికి కారణమవుతుంది. గత ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్య ఓట్ల శాతం తేడా చాలా స్వల్పంగా ఉంది. కవిత కొత్త పార్టీ పెట్టి, రాష్ట్రవ్యాప్తంగా కనీసం ×4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగితే, అది నేరుగా బీఆర్ఎస్ గెలిచే స్థానాలపై ప్రభావం చూపుతుంది. బీఆర్ఎస్ సంప్రదాయ ఓటు బ్యాంకులో మహిళలు, సాంస్కృతిక సంఘాలు కీలక పాత్ర పోషిస్తారు. కవితా తన బలాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తే, ఆ ఓట్లు చీలిపోయి అల్టిమేట్‌గా కాంగ్రెస్ లేదా బీజేపీకి లబ్ధి చేకూరుతుంది. కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేస్తే, బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఆమె వైపు చూసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఆమెకు ఉన్న పట్టు పార్టీకి నష్టం కలిగించవచ్చు. క్యాడర్ ఎవరి వైపు ఉండాలో తెలియక అయోమయానికి గురైతే, పార్టీ క్షేత్రస్థాయిలో బలహీనపడుతుంది. కేసీఆర్ ఇమేజ్‌ను నమ్ముకున్న కార్యకర్తలు, కుటుంబంలోనే చీలిక వస్తే మానసికంగా కుంగిపోయే ప్రమాదం ఉంది.కవితను తమ దారిలోకి తెచ్చుకోకపోతే లేదా ఆమెను పార్టీలో సముచిత స్థానంతో సంతృప్తి పరచకపోతే బీఆర్ఎస్ మనుగడకు పెద్ద సమస్యగా మారుతుంది. పార్టీకి విఘాతం కలగకుండా ఉండాలంటే కుటుంబ సమన్వయం కంటే కూడా రాజకీయ సమన్వయం అత్యవసరం. ఆమెను దూరం పెట్టడం వల్ల వచ్చే నష్టం కంటే, ఆమెతో కలిసి ప్రయాణించడం వల్ల కలిగే లాభాలను పార్టీ అధిష్టానం బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. 2026లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వాడుకుని పుంజుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు, ఈ అంతర్గత సంక్షోభం అడ్డంకిగా మారవచ్చు. కవితా ఫ్యాక్టర్ కేవలం ఓట్ల చీలికకే పరిమితం కాకుండా, పార్టీ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. కొత్త ఏడాదిలో కేసీఆర్ ఈ చిక్కుముడిని ఎలా విప్పుతారో వేచి చూడాల్సి ఉంది.

వార్తాతరంగాలు
శనివారం 03 జనవరి 2026

## రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రివా.. స్ట్రీట్ రౌడీవా!!



**హైదరాబాద్:**రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రివా.. వీధి రౌడీవా అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. కేసీఆర్ మీద చావు మాటలు, అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నావు. ప్రధాన ప్రతిపక్షానికి అసెంబ్లీలో మైక్ ఇవ్వడం లేదు. ముఖ్యమంత్రి మీద మేము విమర్శలు చేయొద్దని స్పీకర్ అంటున్నాడు.. ఇంక మేము ఉండి ఎందుకని అన్నారు.ముఖ్యమంత్రి మీద మాట్లాడితే మైక్ కట్ చేస్తానని స్పీకర్ ఆన్ రికార్డ్ అంటున్నాడు. స్పీకర్ పక్షపాత వైఖరికి నిరసనగా ఈ సెషన్ శాసన సభను బీఆర్ఎస్ పార్టీ బహిష్కరిస్తుందని అన్నారు.

## హిందువుల సొమ్మును ముస్లింలకు దోచి పెడుతున్నారు..

**రేవంత్ సర్కార్‌పై రాకేశ్‌రెడ్డి ఫైర్**



**హైదరాబాద్, జనవరి2 :** అసెంబ్లీలో కాంగ్రెస్, మజ్లీస్ కుమ్మక్కు అయ్యాయని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో గంటల తరబడి మైక్‌ను మజ్లీస్‌కు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఓవైసీ కోసమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ పెట్టిందా అని ఎద్దేవా చేశారు. ఇవాళ(శుక్రవారం) అసెంబ్లీ మీడియా పాయింట్‌లో రాకేశ్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. కాంగ్రెస్ సెక్యులర్ పదాన్ని మరిచిపోయిందని విమర్శించారు. హిందూ ఎమ్మెల్యేలను విస్మరిస్తుందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఈ విషయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్‌లో హిందూ ఎమ్మెల్యేలకు అవమానం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ ఎమ్మెల్యేలు ఉన్న చోట అభివృద్ధి ఎందుకు జరగడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి. తమ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.500 కోట్లు ఇచ్చిందని ఓవైసీ అసెంబ్లీ సాక్షిగా చెప్పారని ప్రస్తావించారు. అత్యధిక పన్ను కడుతున్న హిందువుల సొమ్మును ముస్లింలకు దోచి పెడుతున్నారని ఆరోపణలు చేశారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్ లేదని.. తోక లేదని ఎద్దేవా చేశారు. దోచుకోవడానికి అప్పుడు కాళేశ్వరం.. ఇప్పుడు మూసీని తెరమీదకు తెచ్చారని దెప్పిపొడిచారు. గ్రామీణ తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని ఆరోపణలు చేశారు. భూముల ధరలు పెంచుకునేందుకే.. గ్రామాలను పట్టణీకరణ చేస్తోందని అన్నారు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి. కాళేశ్వరం, పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులతో నిజామాబాద్ జిల్లాకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాకు నష్టం చేయొద్దని హితవు పలికారు. నిజాంసాగర్ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పుణ్యకాలం గడిచిపోయిందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల కాంగ్రెస్ పాలన డీపీఆర్‌లకే సరిపోతుందని విమర్శించారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు పూర్తికావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో నియోజకవర్గానికి రూ. 25కోట్లు ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రజలను మభ్యపెట్టేందుకే అసెంబ్లీ సమావేశాలు పెట్టారని విమర్శించారు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి. బీఆర్ఎస్ అవినీతి ఎక్కడ బయట పడుతుందోనని అసెంబ్లీ నుంచి ఆ పార్టీ నేతలు వాకౌట్ చేశారని ఎద్దేవా చేశారు. చిన్న అంశంపైన భయపడి వాకౌట్ చేస్తే ఎలా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకి జాతీయ హోదా కల్పిస్తామని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలకు హరీశ్‌రావు, కవితలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. కవిత సరైన ఆధారాలతో హరీశ్‌రావుపై ఫిర్యాదు చేస్తానంటే తాను సపోర్టు చేస్తానని స్పష్టం చేశారు. మండలి చైర్మన్ తక్షణమే కవిత రాజీనామాను ఆమోదించాలని డిమాండ్ చేశారు. కవిత రాజీనామా ఆమోదించకపోవడంతో శాసన వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం పోతుందని చెప్పుకొచ్చారు. మండలి చైర్మన్‌ను తాను కలిసి కవిత రాజీనామా ఆమోదించాలని కోరుతానని పైడి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు.

## దుర్గం చెరువు ఆక్రమణ చేయలేదు

**వాహనాల పార్కింగ్ పై కేసు నమోదు**

**కొత్త ప్రభాకర్ రెడ్డి**



**హైదరాబాద్:**దుర్గం చెరువు ఆక్రమణపై తన మీద వస్తున్న వార్తలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కొట్టిపడేసారు. దుర్గం చెరువు కబ్జా అనేది పూర్తిగా నిరాధారం. దుర్గం చెరువులో మేము ఏదో 5 ఎకరాల భూమి కబ్జా చేశాను అని కేసు పెట్టారు.. అందులో మాకు గజం జాగా లేదు, ప్రభుత్వంకు కూడా గజం జాగా లేదని అన్నారు.అక్కడ అందరూ వాహనాల పార్కింగ్ పెట్టుకుంటారు.. అక్కడే ఖాళీ స్థలంలో చెత్త డంప్ చేస్తారు. కావాలని కేసు పెట్టారు.. వాళ్ళ దగ్గర ఆధారాలు ఉంటే చూపించాలి . నాపై కక్షతో కేసు పెట్టారు. బాలక ృష?, లహరి ఎస్టేట్ హరిబాబు భూములు పక్కనే ఉన్నాయి. దుర్గం చెరువులో నాకు భూమి లేదు.. ప్రభుత్వ భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం. రోడ్డు మీద, చెట్ల కింద వెహికిల్ పార్కింగ్ చేసినందుకు కేసు పెట్టారు. ఏదో హైడ్రా వాళ్లకు పిర్యాదు చేశారు అంట మాకు సిబ్బంది ఫోన్ చేశారు.. నేను వెళ్తాను. కేసు పై లీగల్ ఫైట్ చేస్తాం.. పోలీస్ స్టేషన్కు వెళ్తాను పోలీసులకు సహకరిస్తాను. అక్కడ వెహికిల్ పార్కింగ్ చేయడం సహజం. బేషరతుగా కేసు విత్డ్రా చేయకపోతే... ఎఫ్టీఎల్ లో ఇండ్లు కట్టారు.. ఆ ఇండ్ల ముందు ధర్నా చేస్తానని అన్నారు.

## ముఖ్యమంత్రిని విమర్శించకపోతే.. ప్రతిపక్షం ఎక్కడన్నా ముఖ్యమంత్రికి డబ్బా కొడుతుందా?



**హైదరాబాద్:**ముఖ్యమంత్రిని విమర్శించకపోతే.. ప్రతిపక్షం ఎక్కడన్నా ముఖ్యమంత్రికి డబ్బా కొడుతుందా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వకపోవడం ఏంది.. ముఖ్యమంత్రిని పొగడడానికి వస్తారా సభకి. ముఖ్యమంత్రి మూసీ కంపును అంతా తీసుకొచ్చి తన నోటి ద్వారా అసెంబ్లీలో వదిలాడు. ప్రాధానమైన ప్రతిపక్షంగా మేము ప్రజల తరుపున ప్రశ్నలు అడిగి.. మేము పేద ప్రజల ఇల్లు కూల కొడితే వాళ్ల వెంట ఉంటామని చెబితే, ముఖ్యమంత్రి ఇష్టం వచ్చినట్లు దాడి చేసి మాకు అవకాశం ఇవ్వకుండా వేరే ప్రతిపక్షానికి అవకాశం ఇచ్చారని అన్నారు.మా సబితా ఇంద్రా రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి మూసీ ప్రస్తావన తీసుకురాగానే వారి మైక్ కట్ చేసేసారు . స్పీకర్ వైఖరికి నిరసనగా మేము సభను బాయ్ కాట్ చేసామని అన్నారు.

# కన్ఫ్యూజన్‌లో కవిత: మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్, జనవరి 02:** తనకు సీఎం రేవంత్ రెడ్డి అంటే గౌరవమని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తానన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మంత్రి పదవి కోసం తాను ఏ రోజు పాకులాడలేదని చెప్పారు. మంత్రి పదవి కావాలంటూ తాను ఎవరిని అడగలేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవినే తాను త్యాగం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తనకు, తన తమ్మునికి మధ్య ఎటువంటి గొడవలు లేవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కుండబద్దలు కొట్టారు.ఇక బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సీఎం స్పందనపై కవిత శుక్రవారం కాస్తా ఘాటుగా స్పందించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ వదిలిన బాణం కవిత అని ఆయన అభివర్ణించారు. కవిత కన్ఫ్యూజన్‌లో ఉండి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తోందని వ్యంగ్యంగా అన్నారు. కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలంటూ మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. తన తండ్రి మీద సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆమె.. హరీష్ రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదు? అంటూ కవితను ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు.

**జరిగింది ఇది..**

జనవరి 1వ తేదీ గురువారం సాయంత్రం ప్రజాభవన్‌లో జలాలు – నిజాలు అంశంపై తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. దీనికి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పార్టీలోని సీనియర్లు పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వల్లే తగ్గిదంటూ సీఎం రేవంత్ కాస్తా ఘాటుగా స్పందించారు. సీఎం చేసిన వ్యాఖ్యలపై కవిత మండిపడ్డారు. కవిత వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.

# కొత్తగా లాజిస్టిక్ హబ్స్..

## భారీగా పెరగనున్న భూముల ధరలు, ఉద్యోగాలు



**హైదరాబాద్, జనవరి 2:**ప్రస్తుతం నిర్మాణంలో ట్రిపులార్‌తో హైదరాబాద్ నగర విస్తీర్ణం మరింత పెరగనుంది. దీంతో అవుటర్ రింగ్ రోడ్డు, ట్రిపులార్‌ల మధ్య అభివృద్ధిని పరుగులు పెట్టించాలని అధికారులు నిర్ణయించారు. లాజిస్టిక్ హబ్స్ ఏర్పాటు చేయనున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు, ప్రాంతీయ వలయ రహదారి మధ్య ప్రాంతాన్ని ప్రభుత్వం భవిష్యత్ అభివృద్ధికి కేంద్రంగా ఎంచుకుంది. ఫోర్త్ సిటీ ఈ జోన్‌లోనే రూపుదిద్దుకోనుండటంతో మౌలిక వసతులపై దృష్టి పెరిగింది. నగర విస్తరణను ప్లాన్ చేసిన పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ప్రాంతాన్ని ప్రత్యేక గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.విజన్ డాక్యుమెంట్ ప్రకారం ఈ కారిడార్‌లో శాటిలైట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు కీలకంగా మారింది. రవాణా రంగానికి అవసరమైన లాజిస్టిక్ హబ్‌లు కూడా ప్రధాన ప్రాజెక్టులుగా ప్రతిపాదించారు. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వీటి డిజైన్, అమలు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.గతంలో పటాన్‌చెరు పరిధిలోని లక్డారం, పటాన్‌చెరు ప్రాంతాల్లో లాజిస్టిక్ పార్కుల ప్రతిపాదనలు వచ్చినా అవి కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు కొత్త విజన్‌తో మళ్లీ ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది.ఈ అభివృద్ధి ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో లాజిస్టిక్ మౌలిక వసతులు ఏర్పాటుకానున్నాయి.కంటెయినర్ డిపోలు కంటెయినర్ స్టేషన్లు ఫ్రీ వేర్‌హౌజింగ్ జోన్లు ఫ్రైట్ విలేజ్‌లు ఆధునిక గోదాములు కోల్డ్ స్టోరేజీ యూనిట్లు ఎయిర్ కార్గో కాంప్లెక్సులు సరుకు ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లు ఇవి అన్నీ ఒకే ప్రాంతంలో ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం నగరంలో సరకు రవాణా వల్ల ట్రాఫిక్ భారం పెరుగుతోంది. దీనికి పరిష్కారంగా లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలను శివార్లకు తరలించాలనే ఆలోచనకు లాజిస్టిక్ హబ్‌లు బలంగా నిలుస్తున్నాయి. బాటసింగారం, మంగళపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే రెండు హబ్‌లు ఉన్నాయి. మహానగరం చుట్టూ కనీసం పది లాజిస్టిక్ హబ్‌లను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో హెచ్ఎండీఏ అడుగులు వేస్తోంది. బ్లూ గ్రీన్ మొబిలిటీ కాన్సెప్ట్ ఆధారంగా ప్రజా రవాణా, సరుకు రవాణాకు ప్రత్యేక మార్గాలు సిద్ధం కానున్నాయి.ఈ ప్రాజెక్టుల ప్రభావంతో ఓఆర్ఆర్, ట్రిపులార్‌ల మధ్య ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, వేర్‌హౌజ్ జోన్లు, ఇండస్ట్రియల్ యూనిట్లు రావడంతో రియల్ ఎస్టేట్ డిమాండ్ వేగంగా పెరుగుతుంది. నివాస ప్రాజెక్టులు, కమర్షియల్ స్పేస్‌కు మంచి మార్కెట్ ఏర్పడనుంది. ఉద్యోగాల పరంగా చూస్తే లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్, వేర్‌హౌజింగ్, కోల్డ్ స్టోరేజీ, ప్యాకింగ్, ఐటీ సపోర్ట్, మేనేజ్‌మెంట్ రంగాల్లో వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు రానున్నాయి. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు పరోక్షంగా అనేక చిన్న వ్యాపారాలు ఎదిగే అవకాశం ఉంది.

# 24 గంటల మంచినీటి కోసం పక్కా ప్లాన్...




**హైదరాబాద్, జనవరి 2:** భాగ్యనగరం శరవేగంగా విస్తరిస్తోంది. అంబరాన్నంటే భవనాలు, ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలు, కోటిన్నరకుపైగా జనాభాతో ఈ మహానగరం ఇప్పుడు గ్లోబల్ హబ్‌గా మారింది. అయితే పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతులు, ముఖ్యంగా తాగునీరు, మురుగు నీటిపారుదల వ్యవస్థను సిద్ధం చేయడం ఒక సవాలుతో కూడుకున్న పని. ఈ సవాలును స్వీకరించిన హైదరాబాద్‌మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ స్వరేజ్ బోర్డు, సిటీని ఒక ఆదర్శవంతమైన వాటర్ సెక్యూర్ సిటీగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. వాటర్ బోర్డు, వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులతో నగర భవిష్యత్తును మార్చడానికి రంగం సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం రోజు విడిచి రోజు లేదా కొన్ని శివారు ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతోంది. కానీ, ఈ పరిస్థితిని మార్చడమే లక్ష్యంగా వాటర్ బోర్డు ప్రణాళికలు రచిస్తోంది. 2027 చివరి నాటికి నగరంలోని ప్రతి ఇంటికీ ప్రతి రోజూ తాగునీరు అందించడం బోర్డు ప్రాథమిక లక్ష్యం. ఆ తర్వాత 2047 నాటికి తెలంగాణ కోర్ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేలా మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. నగర తాగునీటి అవసరాలు భవిష్యత్‌లో భారీగా పెరగనున్నాయి. 2027 నాటికి నగర తాగునీటి డిమాండ్ 835 ఎంజీడీలుగా, 2047 నాటికి అది ఏకంగా 1114 ఎంజీడీలుగా పెరుగుతుందని అంచనా. ఈ డిమాండ్‌ను తట్టుకోవడానికి గోదావరి జలాలే కీలకం. ఇప్పటికే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా జలాలను వందల కిలోమీటర్ల దూరం నుంచి తెస్తున్న బోర్డు, ఇప్పుడు గోదావరి ఫేజ్–2, ఫేజ్–3 ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. రూ. 7,360 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా అదనంగా 20 టీఎంసీల నీటిని తరలించడానికి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.నగరం మధ్యలో ప్రవహించే మూసీ నదని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఎప్పటి నుంచి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి వాటర్ బోర్డు ఒక భారీ ప్రాజెక్టును చేపట్టింది. మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ద్వారా నదికి పాత వైభవాన్ని తీసుకురావడానికి అధికారులు శ్రమిస్తున్నారు.వంద శాతం మురుగు శుద్ధి: పర్యావరణ పరిరక్షణలో మైలురాయి మురుగు నీరు నేరుగా చెరువులు, నదుల్లో కలవకుండా అడ్డుకోవడం నగర ఆరోగ్యానికి ముఖ్యం. దీని కోసం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 972 ఎంఎల్డీ సామర్థ్యం గల 39 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ప్రారంభమైంది. అమృత్–2.0 పథకంలో భాగంగా రూ. 3849.10 కోట్ల వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయ.2026 నాటికి ఈ పనులు పూర్తి అయితే హైదరాబాద్ మొత్తం మురుగు నీటి శుద్ధి సామర్థ్యం 2,850 ఎంఎల్డీలకు చేరుకుంటుంది.ఇది 2036 వరకు నగర అవసరాలను తీర్చగలదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా,మూసీ నదిలోకి మురుగు చేరకుండా ట్రంక్ లైన్లు వేసేందుకు 4700 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక కూడా సిద్ధమైంది.వేసవి సన్నాహాలు గత వేసవిలో భూగర్భ జలాలు 14 నుంచి 28 మీటర్ల వరకు పడిపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండటానికి వాటర్ బోర్డు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఇంకుడు గుంతల యజ్ఞం ద్వార వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. నగరంలో నమోదైన భారీ వర్షాలు, బోర్డు చర్యల వల్ల భూగర్భ జలాలు గత ఏడాదితో పోలిస్తే 3 నుంచి 9 మీటర్ల వరకు పైకి వచ్చాయి. దీనిని మరింత ముందుకు తీసుకెళ్తూనే, 16వేల గృహాలకు నోటీసులు జారీ చేసి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. వచ్చే మార్చి నాటికి మరో 25వేల గృహాల్లో వీటిని పూర్తి చేయాలని బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది. నగరంలోని ప్రతి మూలకు నీరు చేర్చడానికి కొత్త ప్రాజెక్టును బోర్డు వేగవంతం చేసింది.

1. కోకాపేట్ నియోపోలిస్ లే అవుట్: 298 కోట్లతో వాటర్ సప్లై ప్రాజెక్టు
2.మహీంద్రహిల్స్: 5మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
3. ఆస్మానగ్: 7.5 మిలియన్ లీటర్ల రిజర్వాయర్ నిర్మాణం
4. మంజీరా నెట్‌వర్క్: 722 కోట్లతో నెట్‌వర్క్ ఆధునీకరణ
5. ఉస్మాన్ సాగర్ కండూట్: దీనిని పునరుద్ధరించి రోజుకు 21 మిలియన్ గ్యాలన్ల నీటిని తరలించడానికి 282 కోట్లతో అదనపు పైపు లైన్ నిర్మాణం చేపడుతున్నారు. అంతే కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు వెంట 140 కిలోమీటర్ల మేర రేడియల్ రింగ్ మెయిన్, 98 కిలోమీటర్ల లింకు పైపులైన్ల కోసం 8వేల కోట్లో భారీ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ వాటర్ బోర్డు చేపట్టిన ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి అయితే నీటి కరవు అనేది ఉండని ప్రభుత్వం భావిస్తోంది.

## కాంగ్రెస్ నేతలకు బుద్ధి రావాలి

**హైదరాబాద్:**కాంగ్రెస్ నాయకులకు ఈ సంవత్సరం అయినా మంచి బుద్ధి రావాలని దేవుడిని కోరుకుంటున్నానని కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డా సంజయ్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మూర్ఖత్వపు మాటలు ఇప్పటికైనా ఆపాలి. మిమ్మల్ని తిట్టడం మాకు చాలా ఈజీ, కానీ అది మా సంస్కారం కాదని అన్నారు.

## వరదల సమయంలో మూసి గేట్లు ఒకేసారి తెలిచారు

**హైదరాబాద్:**ఇటీవల వరదలు వచ్చినప్పుడు మూసీ గేట్లు ఉద్దేశపూర్వకంగా ఒకేసారి తెరిచారు.. దీంతో ఇండ్లు మునిగిపోయి, ఎంతో మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.శుక్రవారం అయన అసెంబ్లీలో మాట్లాడుతూ పైనుండి వచ్చే వరదలను ద ృష్టిలో పెట్టుకొని కొద్ది కొద్దిగా నీటిని కిందికి వదలాలి.. కానీ అవేమీ పట్టించుకోకుండా ప్రాజెక్ట్ నిండే వరకు గేట్లు తెరవలేదని అన్నారు.ఆ తర్వాత ఒకేసారి గేట్లు తెరవడంతో ఇండ్లు, రోడ్లు మునిగిపోయాయి.. ఇది కావాలనే ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ పెద్దలు చేశారు, ఇది ప్రభుత్వం ద ృష్టికి వచ్చిందా అని ప్రశ్నించారు.

## చిక్కడపల్లి, దోమల్ గూడ లింక్ బ్రిడ్జ్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్:**జీహెచ్ఎంసీ నిధులు రూ.6 కోట్లతో హుస్సేన్ సాగర్ సర్ ప్లస్ నాలా మీదుగా నూతనంగా నిర్మించిన చిక్కడపల్లి దోమల గూడ లింక్ బ్రిడ్జి ను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యే ముఠా గోపాల్ , మేయర్ గద్వాల విజయలక్ష్మీ,డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్ వి కర?న్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, స్థానిక కార్పొరేటర్ లు తదితరులు పాల్గోన్నారు..

## యూట్యూబర్ అన్వేష్ పై కేసు నమోదు

**దర్యాప్తు ముమ్మరం**

**హైదరాబాద్:**నా అన్వేషణ పేజ్ యూట్యూబర్ అన్వే: కేస్ లో పోలీస్ దర్యాప్తు ముమ్మరం అయింది. హిందూ దేవతల పై వివాదాస్పద కేసుల్లో ఇప్పటికే పంజాగుట్ట పిఎస్ లో కేస్ నమోదు అయింది. ఈ నేపథ్యంలో పంజగుట్ట పోలీసులు ఇన్స్టాగ్రామ్ కు లేఖ రాసారు. వీడియో కంటెంట్ లింక్ ఉన్న అన్వేష్ యూజర్ ఐడి వివరాలు ఇవ్వాలని కోరారు.

# ఆదుకునేందుకు సమన్వయంతో ముందుకు సాగుతాం....

**ప్రత్యేక కార్యాచరణ తో ముందుకు**
**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్ కర్నూల్ జనవరి 2(స్కైన్యూస్)** ప్రజా సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి అందించేందుకు వారిని ఆదుకునేందుకు అన్ని శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు మీడియా సహకారంతో అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతూ రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మీడియాతో ప్రత్యేక మీట్ ది ప్రెస్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మొదట గత సంవత్సరం జిల్లాలో పథకాలలో సమర్థవంతంగా అభివృద్ధి చేసి అందరికీ ఆదర్శంగా నిలవడం జరిగిందని తెలిపారు. వ్యక్తిగత జీవితాలను కుటుంబాలను సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు పక్కనపెట్టి ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పని చేయడంతో పాటు బాధ్యతతో మంచి కథనాలను ప్రచురించి యువతను చెడు దారి పట్టకుండా ఎంతో కృషి చేశారని కొనియాడారు. సంక్షేమ పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి పేదవాడికి వాటిని అందించేందుకు జిల్లా యంత్రాంగం నిర్విరామంగా కృషి చేయడం జరిగిందని తెలిపారు గత సంవత్సరంలో విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావడం జరిగిందని తెలిపారు. నూతన సంవత్సరంలో విద్యా వైద్యం తో పాటు అంగన్వాడి మహిళా అభ్యున్నతి ఇందిరమ్మ ఇండ్లు భూభారతి పై దృష్టి సారించడంతోపాటు ఆయిల్ ఫామ్ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తామని వివరించారు. కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రభుత్వ పాఠశాలలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీలు చేయడం వల్ల సమూల మార్పులకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేసినట్లు వివరించారు పాఠశాల తనిఖీలు అధ్యాపకుల గైరాజరు తెలుసుకొని వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాలకు హాజరయ్యే విధంగా కృషి చేశామని తెలిపారు. విద్యారంగంలో జిల్లాలో సాధించిన ఫలితాలతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్థానంలో జిల్లాను నిలబెట్టడం జరిగిందని అన్నారు. గత సంవత్సరంలో భూభారతి ద్వారా సమస్యలు పరిష్కరించాలని 3 వేలకు పైగా దరఖాస్తులు అందడం జరిగిందని ప్రతిరోజు ఒక మండలాన్ని పరిగణలోకి తీసుకొని దరఖాస్తుల పరిష్కారానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు జిల్లాలో యూరియా పంపిణీ చేసేందుకు 385 ప్రాంతాలను యూనిట్లుగా విభజించి ప్రతిరోజు 4000 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు లేని ప్రతి పేదవారికి మొదటి వేడుకలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇల్లు నిర్మించుకునేలా కృషి చేయడం వల్ల 60 శాతం నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందని చెంచు పెంటలలో 1100 ఇండ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు వారు గృహాలను నిర్మించుకునే పరిస్థితుల్లో లేనందున ఒక కమిటీని ఏర్పాటు చేసి వాటిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. చెంచుల అభ్యున్నతికి వారి జీవన ఆర్థిక విధానాన్ని అభివృద్ధి చెందేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగడం జరుగుతుందని త్రాగునీరు విద్యుత్ వైద్యం విద్య లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చేలా ఉద్యాన పంటల సాగుకు అనువైన అంశాలను దృష్టిలో ఉంచుకొని అమ్రాబాద్ మండలం మాధవరం గ్రామంలో ఉద్యాన పంటలతో పాటు ఉచిత సోలార్ విద్యుత్తును అందించడం జరిగిందన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి మహిళా శక్తి ద్వారా క్యాంటీన్ నిర్వహణ చేపట్టడంతో పాటు పలు ప్రాంతాలలో పెట్రోల్ పంపులు నిర్వహణను సోలార్ ప్లాంట్ ఏర్పాటును చేస్తున్నట్లు తెలిపారు ముంపు బాధితుల సమస్యలను పరిష్కరించడం జరిగిందని పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థల సేకరణ చేయడం జరిగిందన్నారు అనంతరం మీడియా ప్రశ్నలకు సమాధానం తెలిపారు

## పునాదులకే పరిమితమైన జిల్లా గ్రంధాలయ భవనం



**జోగులాంబ గద్వాల, జనవరి 2(స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా గ్రంథాలయ భవనం పునాదులకే పరిమితమైంది. గ్రంథాలయ నిర్మాణానికి రూ కోటి అరవై లక్షలు మంజూరు కాగా గత ఏడాది పిల్లర్ల వరకు పనులు చేసి నిధులు లేక నిలిపివేశారు. దీంతో కాంట్రాక్టర్ కూడా బిల్లుల మంజూరు కాక మధ్యలో నిలిచిపోవడంతో పాఠకులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రంథాలయం కేఎల్ఐ క్యాంపులో ఇరుకు గదులలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ కనీసం వసతులు కూడా లేవు. దీనిపై ఇదివరకే పలువురు ఆందోళనలు వ్యక్తం చేసిన నేటి వరకు జిల్లా కలెక్టర్ గాని ఇలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు పాఠకులు ఆరోపిస్తున్నారు. వెంటనే గ్రంధాలయ భవన నిర్మాణ పనులు పున ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా...

**మండల వ్యవసాయ అధికారి పి నర్మదా**



**తెలకపల్లి జనవరి 2 (స్కైన్యూస్)** మండల పరిధిలోని రైతులకు దూడియా అందుబాటులో ఉందని రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని మండల వ్యవసాయ శాఖ అధికారి పి నర్మదా తెలిపారు శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలు మరియు ఆగ్రో రైతు సేవా కేంద్రాల తోపాటు హకా కేంద్రాలలో 108 మెట్లు యూరియా అందుల బాటలో ఉందని తెలిపారు. నేడు తెలకపల్లి సహకార బ్యాంకు కార్యాలయంలో మరియు హాఫ్ ఆఫ్ పెద్దూరు కాక రెండు తెలకపల్లి కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంటుందని వివరించారు రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని ఆమే కోరారు

# స్వర్ణగిరి దేవస్థానానికి పోటెత్తిన భక్తులు భక్తుల...









**సుమారు 2 లక్షల మంది భక్తుల దర్శనాలు.**
**స్వర్ణగిరీశున్నీ ధర్మదర్శనానికి 6 సమయం.**

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (స్కై న్యూస్)** జనవరి 2 తెలంగాణలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన యాదాద్రి తిరుమల శ్రీ స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని భక్తుల తాకిడి నెలకొంది. ఆలయ మాడవీధుల నిండా జనాలు కిక్కిరిసిపోయారు. స్వామి వారి ధర్మ దర్శనానికి సుమారు 6 గంటల సమయం , స్పెషల్ దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వర్ణగిరి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు , వైకుంఠ ఏకాదశి వేడుకలను పురస్కరించుకొని గత వారం రోజులుగా ఆలయం భక్తులతో నిండిపోయింది. వైకుంఠ ఏకాదశి వేడుకలలో భాగంగా డిసెంబర్ 30 2025 నుండి జనవరి 8 2026 వరకు సుమారు 15 లక్షల మంది ఆలయాన్ని సందర్శించవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా మంచినీటి సదుపాయాలు పరిశు భ్రత వంటి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు మాట్లాడుతూ రాష్ట్రంలోని కనివిని ఎరుగని రీతిలో ఆలయ నిర్మాణం మరియు పుష్పాలంకరణ మహాద్భుతంగా ఉన్నాయని , భారతదేశంలోనే ఎక్కడలేని విధంగా జల నారాయణని దర్శించుకోవడంతో మా జన్మ ధన్యమైందని భక్తులు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. అలాగే ఆలయానికి గజేంద్రుడు రావడం భక్తులను ఆశీర్వదించడం వంటి కార్యక్రమాలతో పాటు చిన్న పిల్లల ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అల్లరించాయని తెలిపారు.

## జిల్లా ఎస్పీగా భాద్యతలు స్వీకరించిన అక్షాంశ్ యాదవ్...

**ఆకాంక్ష యాదవుకు శుభాకాంక్షలు తెలిపిన ఏసీపీలు సిఐలు ఎస్ఐలు**



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి: (స్కై న్యూస్ ) జనవరి 2:**తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీగా అక్షాంశ్ యాదవ్ మంగళవారం రోజు తన బాధ్యతలను స్వీకరించారు. ఇన్ని రోజులు రాచకొండ కమీషనరేట్ పరిధిలో ఉన్న యాదాద్రి భువనగిరి జోన్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా యాదాద్రి భువనగిరి జిల్లాగా ఏర్పాటు అయింది. ఈ మేరకు ఇప్పటి వరకు డీసీపీగా భాద్యతలు నిర్వర్తించిన అక్షాంశ్ యాదవ్ నేటి నుంచి ఎస్పీగా భాద్యతలను చేపట్టనున్నారు. ఈ సందర్రేగా ఆయన మాట్లాడుతూ ముందుగా డిజిపి , రాచకొండ సి పి సుధీర్ బాబు తనపై పూర్తి నమ్మకంతో పెట్టిన బాధ్యతలను తూచా తప్పకుండా..ఎలాంటి రాగదేశాలకు పోకుండా విధులను నిర్వహిస్తానని యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతానని , జిల్లాలో నేరాల సంఖ్యను తగ్గించే విధంగా చూస్తానని , గంజాయి , డ్రగ్స్ , విక్రయ దారులను వినియో గదారులను పూర్తిస్థాయిలో నియంత్రించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్రేగా పట్టణ ఏసిపి , రూరల్ ఏసిపి , సిఐలు , ఎస్ఐలు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆకాంక్ష యాదవును పుష్పగుచ్ఛాలి ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రక్తదాన శిబిరాల విజయవంతానికి యువత కృషి చేయాలి....



**నాగర్ కర్నూల్ జనవరి 2 (స్కైన్యూస్)** అత్యవసర పరిస్థితులలో రోగుల ప్రాణాలను కాపాడడంలో రక్తదానం కీలకంగా మారుతుందని రక్తదాన శిబిరాలను విజయవంతం చేసేందుకు యువత మరియు స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాలని జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెంట్ శేఖర్ కోరారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యలు ఏర్పడమని నూతన రక్తం వల్ల మానసికంగా శారీరకంగా ప్రయోజనం పొందవచ్చు అన్నారు ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి జిల్లా కోఆర్డినేటర్ హకీం విశ్వప్రసాద్ మాజీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ రెడ్డి తో పాటు పలువురు రక్తదానం చేశారు ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ రోహిత్ క్లబ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి కోశాధికారి మలిపెద్ది సురేష్ కుమార్ మాజీ గవర్నర్ సూరంపల్లి రాధాకృష్ణ జోన్ చైర్ పర్సన్ దొడ్ల రాధారెడ్డి మాజీ రీజియన్ చైర్మన్ హకీం విశ్వప్రసాద్ చెప్ప శ్రీను మాజీ అధ్యక్షులు రాజయ్య వెంకటరాజా లక్ష్మీ నరసింహ గౌడ్ ప్రేమ్ కుమార్ రెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## యాదగిరిగుట్ట ఈవో వెంకటరావు రాజీనామా...



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి (స్కై న్యూస్) జనవరి 2:** తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఈవో వెంకటరావు తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్రేగా ఆయన మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా తనపై చూపించిన ఆదరణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ తన ఆరోగ్య సమస్యల కారణంగానే నిర?యం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈయన రాజీనామాకు సంబంధించి ఆదేశాలు జారీ చేసింది. గతంలో వెంకటరావు దేవదాయ శాఖ కమిషనర్ గా , యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈవోగా పని చేశారు. రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా ఆయన యాదగిరిగుట్ట ఈవో గా నియమితులై విధులు నిర్వహించారు. దేవస్థాన వీధులపై ఆయన చిన్న చూపు చూపిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నుండి మరియు ప్రజాప్రతినిధుల నుండి ఒత్తిడికి గురవుతున్నట్లు పలువురు ప్రముఖులు వ్యక్త పరుస్తున్నారు. దీని కారణంగా ఆయన రాజీనామా చేస్తున్నట్లు వాళ్లు వివరించారు.

## తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్న చలి...

**పలు ప్రాంతాల్లో కమ్మేసిన పొగ మంచు....**



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి: (స్కై న్యూస్) జనవరి 2** తెలుగు రాష్ట్రాల్లో చలి చంపేస్తోంది. ఉదయం పూట రహదారులపై విజిబిలిటీ తగ్గిపోతోంది. ఇక తెలంగాణను చలి పులి వణికిస్తోంది. హైదరాబాద్ నగరం తో పాటు పలు జిల్లాల్లో పొగ మంచు కమ్మేసింది.దట్టమైన పొగ మంచు కారణంగా రోడ్లమీద విజిబిలిటీ తగ్గిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఉష్ో?గ్రతలు సింగిల్ డిజిట్ కు పడిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉష్ో?గ్రతలు మరింత తక్కువగా నమోదవుతున్నాయి. రానున్న రెండుమూడు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్‌లో 6.2 డిగ్రీల కనిష్ట ఉష్ో?గ్రత నమోదయింది. ఇక పటాన్‌చెరులో 8.2, మెదక్‌లో 9.3, రాజేంద్రనగర్ 11, హైదరాబాద్ 13.8, రామగుండంలో 11.8 డిగ్రీల కనిష్ట ఉష్ో?గ్రతలు నమోదయ్యాయి. దీంతో వాకర్లు%ౌా%స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లతో పార్కుల్లో మార్నింగ్ వాక్‌లు చేస్తున్నారు. చలి, పొగమంచు కారణంగా రోజువారీ పనుల కోసమే ఉదయం బయటికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత పెరగడంతో చిన్న పిల్లలు, వృద్దులు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్‌లో ఉదయం పూట పొగమంచు దట్టంగా కమ్ముకుంటోంది. దీంతో రహదారులపై కనుచూపు మేరలో కూడా వాహనాలు కనిపించడం లేదు. ఈ పొగమంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక నల్గొండ జిల్లా చిట్యాల, చౌటుప్పల్ మధ్యలో దట్టమైన పొగ మంచు అలుముకుంటోంది. హైదరాబాద్ %--% విజయవాడ జాతీయ రహదారిపై భారీగా పొగ మంచు కురుస్తోంది. హైవేపై హెవీ ఫాగ్ ఉండడంతో వాహనదారులు హెడ్ లైట్లు వేసుకొని జాగ్రత్తగా వెళ్తున్నారు. ఉదయం ఎనిమిది గంటలు దాటినా పొగమంచు ప్రభావం తగ్గడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వేగం తగ్గించుకుని మెల్లగా వెళుతున్నారు.

## జిల్లా విద్యాశాఖ అధికారి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి టి.ఎస్.ఎస్.ఓ నాయకులు

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 2 :-** రంగారెడ్డి జిల్లాలోని డీఈఓ కార్యాలయంలో టి ఎస్ ఎస్ ఓ నాయకుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టి.ఎస్.ఎస్.ఓ) రాష్ట్ర అధ్యక్షులు మీసాల లక్ష్మీ నివాస్ అధికార ప్రతినిధి మానాజిపేట్ రమేష్ రాష్ట్ర కమిటీ నాయకులు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి డి ఈ ఓ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశసి



నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు అనంతరం జిల్లాలోని పలు విద్యా అంశాలు విద్యార్థుల సమస్యలపై వారితో సుదీర్ఘంగా చర్చలు నిర్వహించారు.

వార్తాతరంగాలు

శనివారం 03 జనవరి 2026

## కమ్యూనిస్టు ఉద్యమానికి ఏబి బర్ధన్ సేవలు చిరస్మరణీయం

**ప్రజల కోసం అంకితభావంతో పోరాడిన నేత ఏపీ బర్ధన్ బర్ధన్ ఆశయాలను ముందుకు తీసుకెలదాం**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**సిపిఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా బర్ధన్ వర్ధంతి**



**కొత్తగూడెం జనవరి2( స్కై న్యూస్):** కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏ బి బర్ధన్ పదో వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత బర్ధన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ సాబిర్ పాషా గారు మాట్లాడుతూ, ఏపీ బర్ధన్ తన జీవితమంతా కార్మికులు, రైతులు, పేద ప్రజల హక్కుల కోసం అంకితభావంతో పోరాడారని, పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన మహానేతగా బర్దన్ చరిత్రలో నిలిచారని అన్నారు. పార్లమెంటరీ వ్యవస్థలోనూ, ఉద్యమ రంగంలోనూ కమ్యూనిస్టు విలువలను కాపాడుతూ ముందుకు నడిపించిన నేత అని పేర్కొన్నారు. మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. బర్ధన్ బాటలో నడుస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కమ్యూనిస్టుపై ఉందని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆయన ఆశయాలు మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవసం ఉందని, పార్టీ శ్రేణులు ప్రజల మధ్యకు వెళ్లి ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా నాయకులు జి వీరాస్వామి, దమ్మాలపాటి శేషయ్య, వంగ వెంకట్, భూక్యా శ్రీనివాస్, పట్టణ నాయకులు మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, రాములు, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణాచారి, మాతంగి లింగయ్య, మల్లయ్య, ధనలక్ష్మి, షాహీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యాన్ని అందించడంలో భాగస్వాములు కావాలి...

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్**



**నాగర్ కర్నూల్ జనవరి 2 (స్కై న్యూస్)** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ల్యాబ్ టెక్నీషియన్లు భాగస్వామ్యం కావాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవికుమార్ కోరారు శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియల్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా అన్ని రకాల వ్యాధి నిర్ధారిత పరీక్షలను జరిపి రోగులకు సేవలు అందించాలని సూచించారు. రోగులకు వైద్యం అందించడంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో ఉందని వారు నిర్ధారణ చేసిన తర్వాతే సరైన వైద్యం అందించాల్సి ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ సంఘ అధ్యక్షులు పి కళ్యాణ్ కృష్ణారావు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ శ్రీనివాసులు ఉపాధ్యక్షులు నారాయణ ఆంజనేయులు సాయి కార్యదర్శులు శ్రీధర్ రెడ్డి సభ్యులు నాగరాజ్ శశి కుమార్ శ్రావణ్ కుమార్ సత్తయ్య హెల్త్ ఎడ్యుకేటర్స్ శ్రీనివాసులు రాజగోపాలాచారి ఆకుతోట మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు

## దళిత రిజర్వేషన్లు 25 శాతం కు పెంచాలి

**కార్పొరేషన్ నిధులు పూర్తిగా అందించాలి**

**అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం విజయ్**



**నాగర్ కర్నూల్ జనవరి 2( స్కై న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం దళిత రిజర్వేషన్లను 15% నుండి 25 శాతానికి పెంచి ప్రస్తుతం కొనసాగుతున్న శాసనసభ సమావేశాలలోనే చట్టబద్ధత కల్పించాలని అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం విజయ్ డిమాండ్ చేశారు శుక్రవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సంఘ ఆధ్వర్యంలో దళితుల సింహగర్జన మహాధర్నాను నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 25% దళితులు ఉండగా 15% రిజర్వేషన్ అమలు కావడం వల్ల సహకార సంస్థలలోని ఎన్నికలలో దళితులకు తీరని అన్యాయం జరుగుతుందని రిజర్వేషన్ల అమలులో జాప్యం వల్ల అనేక రాజకీయ సంస్థలలోకి దళితులు అడుగుపెట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పిటిసి మునిసిపల్ గ్రేటర్ ఎన్నికలు నిర్వహించాలని విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని కార్పొరేషన్ నిధులను 100% ఖర్చు చేయాలని విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులు అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్న వాటిని అరికట్టడంలో పాలకులు అధికారులు విఫలం చెందుతున్నారని వెంటనే రక్షణ రక్షణ కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నిజాం అంబేద్కర్ సంఘం జిల్లా అధికార ప్రతినిధి చంద్ర స్వామి జిల్లా కార్యదర్శి జిలకర బాలస్వామి ఉపాధ్యక్షుడు నరేందర్ సహాయ కార్యదర్శి శివశంకర్ నాయకులు రాములు కాశన్న చంద్రయ్య రామకృష్ణ హుస్సేన్ రాము కళాకారులు అవుట సోమన్న తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాల సమస్యలు పరిష్కరించాలి



**నారాయణపేట జనవరి 2: (స్కైన్యూస్)** నారాయణపేట మండలం అప్పిరెడ్డి పల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కారం చేయాల ని 2వ వార్డు సభ్యుడు బల్ల అనిల్ ప్రభుత్వాన్ని కోరారు .శుక్రవారం ఆయన ప్రభుత్వ పాఠశాలలో విద్యా ర్థులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు సరి పడ బాత్రూంలు, మరుగుదొడ్లు,మంచినీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయ కులు బొక్క నరసింహ. గోవింద్. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ నేతను విమర్శిస్తే సహించం

**బీజేపీ పోరాటంతోనే ప్రాథమిక చికిత్స ప్రారంభం**

**కాంగ్రెస్ ది చౌకబార్ రాజకీయం**

**చెల్లని రూపాయి కనుకనే శివకుమార్ రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదు**

**కాంగ్రెస్ పై బిజెపి నాయకుల మండిపాటు**



**నారాయణపేట జనవరి 2: (స్కైన్యూస్)** ఉద్యమాల నేత నాగు రావు నామాజీ ని విమర్శిస్తే సహించేది లేదని నారాయణపేట బిజెపి పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్,ప్రధాన కార్యదర్శి నక్క సత్య నారాయణ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,బి జె వై ఎం పట్టణ అధ్యక్షుడు మణిశంకర్ హెచ్చరించారు.శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతుసదరు కాంగ్రెస్ నాయకులు బిజెపి నాయకులపై చౌకబారు నిందలు చేస్తే సహించం అన్నారు.డి డి సి మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి ఏ హోదాలో ప్రభుత్వ అధికారిక కార్యక్ర మాలలో సమీక్ష నిర్వహిస్తారు అని ప్రశ్నిస్తే దానికి సమాధానం ఇవ్వకుండా కాలం చెల్లిన నాయకులు తమ్ముడిని మునిసిపల్ చైర్మన్ చేయాలనుకుంటున్నాడని అంటూ ప్రగల్భాలు పలకడం విచిత్రంగా ఉందన్నారు. ప్రోటోకాల్ తెలియని కాంగ్రెస్ నాయకులు బిజెపి గురించి మాట్లాడతారా? అంటూ మండిపడ్డారు.పూటకో పార్టీ గంటకో కండువా మార్చి విలువలకు తిలోదకాలు ఇచ్చి ఎమ్మెల్యే టికెట్ కే నోచుకోలేని మీ నాయకుడి నైతికత గురిం చి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లూ ఉందన్నారు.కానీ మా నాయ కుడు నాగురావు ఎన్ని ప్రలోభాలు చూపిన ఎన్ని ఆశలు చూపిన మొక్కవోని దిక్షతో ఒకే పార్టీలో ఉండి విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలవడం జరిగిందన్నారు. రిజర్వేషన్ ప్రక్రియనే పూర్తీ కాలేదని ఎలక్షన్ గెలవకుండా తమ్ము డిని చైర్మెన్ ఎట్లా చేస్తరు అన్నా కనీస జ్ఞానం కాంగ్రెస్ నాయకులకు లేకపోవడం విడ్డూరం అన్నారు. మీ లాగా బిజెపి కుటుంబ రాజకియ పార్టీ కాదని సొంత సామర్థ్యం ఉంటేనే నిలు స్తాదని అన్నారు.69 జిఓ కోసం అఖిల పక్షం ఉద్యమం చేస్తున్నప్పుడు 250కిలో మీటర్లు పాద యాత్ర చేస్తుంటే మీ నాయకుడు శివకుమార్ రెడ్డి ఎక్కడ ఉన్నాడు? ఏ పార్టీలో ఉన్నాడు ?నోరు ఎందుకు మెదప లేదు?నారాయణపేట జిల్లా ఉద్య మంలో మీ నాయకుడు ఎక్కడ ఉన్నాడు? అని నిలదీశారు.ఇప్పుడు జిల్లా ఆస్పత్రికి నిధులు కేంద్రప్రభుత్వం 66 కోట్ల రూపాయలు ఇచ్చిందనీ జి ఓ ఎం ఎస్ నెంబర్ 149/2020 ద్వారా నిధులు విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఏమి ఇచ్చిందని ప్రశ్నించారు.కానీ మీమే ఆస్పత్రి నిర్మించామని సంకలు గుద్దుకోవడం విచిత్రం అన్నారు. రాత్రికి రాత్రే జిల్లా ఆసుపత్రి నీ మార్చింది మీరు కాదా దాంతో చికిత్స అందక 48 మంది సావులకు కారణం మీరు కాదా? అని అన్నా రు.అందుకు కాంగ్రెస్ నాయ కులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.కానీ బిజెపి పోరాటం చేయడంవల్ల , ఎన్ని కల దృష్ట్యా మళ్ళీ ప్రాథమిక చికిత్స అదే పాత ఆసుప త్రిలో పెట్టడం అవకాశవాద రాజకీయం కాదా?అని ప్రశ్నించారు.కాంగ్రెస్ నాయకులు ఎన్ని నాటకాలు ఆడిన ఎన్ని జిమ్మిక్కులు చేసిన నారాయణపేట మున్సిపల్ చైర్మన్ సీటును బిజెపి దక్కించుకోవడం ఖాయమని అన్నారు. ఇప్పటికైనా చౌకబారు విమర్శలు మాని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేకపోతే కాంగ్రెస్ పార్టీ కి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

# అలరించిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన







**నారాయణపేట జనవరి 2 (స్కైన్యూస్):**నారాయణపేట జిల్లా 3 వ విద్య వైజ్ఞానిక ప్రదర్శనను నారాయణపేట మండలం జాజాపూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అధ్యక్షత న జరిగిన ఈ కార్యక్రమంను నారాయణపేట జిల్లా ఇంచార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్ అడిషనల్ కలెక్టర్ శ్రీను,ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ నాకు సామాన్య శాస్త్రం అంటే చాలా ఇష్టం అని నేను కలెక్టర్ గా కాకుండా ఇంజనీర్ గా చెప్పుకోవడం చాలా ఇష్టం అని విద్యార్థులు రేపటి దేశ భవిష్యత్ మీరే అని ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు బాగా వినాలని, ఏదైనా సాధించాలంటే ముందు ఆచరించాలని మనం చేయాలనుకున్నది ఫెయిల్ అయితే ఎందుకు ఫెయిల్ అయ్యింది మనకు తెలిసివస్తుంది అని అన్నారు,మరో ఆరు నెలల్లో కోస్గిలో బిర్లా ప్లానిటోరియం ఏర్పాటు అవుతుంది అని దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యాధికారి గోవిందరాజులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల నుండి 7 విభాగాలలో 135 ప్రదర్శనలు వచ్చాయని,వైజ్ఞానిక ప్రదర్శన లో 21 కమిటీ లు ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేస్తున్నాయని దీనికి అందరూ ఉపాధ్యాయులు సహకారం ఉందని అన్నారు, నేటి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి నోబెల్ స్థాయికి ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శనలను జిల్లా కలెక్టర్ సందర్శించి వారితో ప్రశ్నలు అడిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళలకు పాడి పరిశ్రమలు...?



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :( స్కై న్యూస్ ) జనవరి 2** తెలంగాణ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రేవంత్ రెడ్డి , సర్కార్ అనేక పథకాలను అమలు చేస్తోంది. ఇప్పటికే మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు , పెట్రోల్ బంకులు కేటాయించడంతో పాటు..మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది. అయితే , తాజాగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర?యం తీసుకుంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో మహిళా సాధికారత , ఆదాయం పెంపుదల , పాడి అభివ ృద్ధికి ఊతమిచ్చేందుకు ఇందిరా డెయిరీ ప్రాజెక్టును చేపట్టాలని ప్రభుత్వం నిర?యించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి రెండేసి పాడి గేదెలు లేదా ఆవులను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. రాష్ట్రంలో పాల కొరత తీవ్రంగా ఉంది. రోజూ 30 లక్షల లీటర్లు వినియోగమ వుతుండగా.. ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీకి పాడి రైతులు కేవలం నాలుగు లక్షల లీటర్లు సరఫరా చేస్తున్నారు. మిగిలిన 26 లక్షల లీటర్లను ఇతర రాష్ట్రాల నుంచి దిగు మతి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పాడి పరిశ్రమను ప్రోత్సహించాలని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివ ృద్ధి సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. దీంతో ప్రభుత్వం ఇందిరా డెయిరీ ప్రాజెక్టుపై ద ృష్టిసారించింది. ఇందిర డెయిరీ ప్రాజెక్టు కింది ప్రతి పది గ్రామాలను ఒక యూనిట్‌గా ఏర్పాటు చేస్తారు. ఒక్కో మహిళా స్వయం సహాయక సంఘం సభ్యురాలికి రూ.2 లక్షల యూనిట్ ధరతో రెండు పాడి గేదెలు లేదా అవులను అందజేస్తారు. ఇందులో ప్రభుత్వం 70 శాతం సబ్సిడీ ఇస్తుంది..బ్యాంకుల ద్వారా రూ. 60 వేలు రుణాలు ఇస్తారు. అంతేకాదు..రవాణా కోసం ప్రభుత్వం ట్రాలీ ఆటోలను అందజేస్తుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజక వర్గంలో దీనిని పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలోని కొడంగల్ సహా ఇతర ప్రాంతాలకు దీనిని విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇందిరా డెయిరీ ప్రాజెక్టును ప్రభుత్వం మధిర నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం 781.82 కోట్లు ఖర్చు అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటికే రూ. 286 కోట్లను విడుదల చేసిన సర్కార్.. తాజాగా..రూ.124.92 కోట్ల విడుదలకు పరిపాలన అనుమతులు లభించాయి. మరో రూ.370 కోట్ల మేరకు నిధులు విడుదల కావాల్సి ఉంది.

# పి ఆర్ టి యు డైరీ,కాలెండర్ ఆవిష్కరించిన డి ఈ ఓ



**నారాయణపేట జనవరి 2: (స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా శాఖ అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి వెంకట్ రెడ్డి డిఈఓ గోవింద రాజులు,సిబ్బందికి శుక్రవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పి అర్ టి యు టి ఎస్ సంఘం 2026 సంవత్సర క్యాలెండర్ను డిఇఓ చేతుల మీదుగా ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సభ్య త్వం కలిగి నిరంతరము ప్రభుత్వాలతో చర్చించి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పి ఆర్ టి యు సంఘం ముందుంటుందని అన్నారు.అదేవిధంగా నారాయణపేట జిల్లాలో పి అర్ టి యు టి ఎస్ సంఘము ఉపాధ్యాయ సమస్యలతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించుటకు, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయుటకు సంఘం కృషి చేయడము అభినందనీయమని అన్నారు. అదేవిధంగా జిల్లాలో జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శనలో సంఘ సభ్యులు చురుకుగా పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేస్తున్నారని అందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి ఇప్పటి వరకే తాము అడిగిన వేసవి సెలవులలో శిక్షణ పొందిన ఉపాధ్యా యుల ఆర్జిత సెలవుల ఉత్తర్వులు, ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో సెల వులలో విధులు నిర్వహిం చిన వారికి సిసిఎల్ ఉత్తర్వు లు వెంటనే ఇవ్వాలని మరొకసారి విజ్ఞప్తి చేయగా డీఈఓ సైన్స్ ఫెయిర్ ముగియగానే కార్యాలయం నుండి ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. కార్యాలయం నుండి రావలసిన వాటిని వెంటనే పూర్తి చేస్తామని అన్నారు.గత సంవత్సరము కంటే మెరుగ్గా ఈ సంవత్సర ము 10 వ తరగతి ఫలితాలు 100% విద్యార్థులు సాధించే లా అందరూ సమిష్టిగా కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల విద్యాధికారి బాలాజీ , ఏ ఎమ్ ఓ విద్యాసాగర్ , సెక్టోరియాల్ అధికారి నాగా ర్జున రెడ్డి , జి సి డి ఓ సంగీత నారాయణపేట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం రఘువీర్, ఎం జనార్ధన్, దామరగిద్ద మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు సత్య నారాయణ రెడ్డి, రమేష్, ఉట్కూర్ మండల ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, రాష్ట్ర జిల్లా బాధ్యులు కే శ్రీనివాస్, నరేష్, పి అనిల్ కుమార్,సత్యపాల్, మహేష్ కుమార్ కళ్యాణి, నరసింగ రావు, రాములు, సాయప్ప, భాగ్యరాజ్,శ్రీనివాస్ బాలాజీ,అరవిందు కుమార్, వెంకట్రాములు, సలాం, సాదిక్ వెంకటేశ్వర్లుశంకర్ పెద్ద మొత్తంలో ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

# టిజెఏసి ఉద్యమ నాయకుల ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపాన్ని ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 2 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం, బ్లాక్ ఆఫీస్ సమీపంలో టిజెఏసి ఉద్యమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపానికి భూమి పూజ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై అమరవీరుల స్థూపాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అమరవీరులుగా మారిన తెలంగాణ ఉద్యమకారుల సమాధుల మీద బీఆర్ఎస్ పునాదులు నిర్మించుకొని దశాబ్ద కాలం పాటు రాజ్యమేలినా వారికోసం ఒక్క స్థూపాన్ని నిర్మించలేని దుస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు అమరవీరులు, ఇప్పుడున్న ఉద్యమకారులు నిజమైన తెలంగాణను ఆకాంక్షించిన వ్యక్తులని ప్రశంసించారు అలాంటి వ్యక్తులకు బీఆర్ఎస్ హయాంలో కనీస గౌరవం దక్కలేదని అన్నారు గత ప్రభుత్వ హయాంలో ఎలాగో అమరవీరులకు సరైన గౌరవం దక్కలేదని ప్రస్తుత ప్రభుత్వమైన వారి కుటుంబాలకు అండగా ఉండాలని కోరుకుంటున్నానని ఈ సందర్భంగా ఆయన అన్నారు అమరవీరుల స్తూపం ప్రతిపాదనను తన వద్దకు తెచ్చినప్పుడు



తాను వెన్నంటి ఉంటానని హామీ ఇచ్చానని ప్రస్తుతం దీనిని వీలైనంత త్వరగా పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడించారు ఎలాంటి కార్యక్రమాలైనా జరుపుకునేందుకు వీలుగా ఈ స్థూపం వద్ద ఒక వేదిక కూడా నిర్మిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు ఈ కార్యక్రమంలో షాద్ నగర్ టిజెఏసి ఛైర్మన్ జనార్ధన్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి వెంకట్ రాంరెడ్డి, టిజెఏసి నేత షాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరక్టర్ త్రిప్పిశెట్టి కర్ణకర్, తెలంగాణ ఉద్యమ కారులు మంగులల్ నాయక్, ఎమ్మే సతయ్య, టీజేఏసీ నేతలు రామరావు,ఎం వెంకట్ రెడ్డి, నక్క బాలరాజు, తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ కో కన్వీనర్ జాంగారి రవి , టిజెఏసి రాష్ట్ర నేత శ్రీనివాస్ రాజు, సంఘాల నేతలు తిరుమలయ్య, హెల్త్ శ్రీనివాస్, సత్యం,పులి మామిడి విరంజయ్య గౌడ్,అర్జునప్ప, బాధేపల్లి సిద్దార్థ, టెలిఫోన్ వెంకటయ్య, రవీంద్రనాథ్,గౌర్ల రాము, మేకల వెంకటేష్, అన్నారం బాలు నాయక్, అదెట్ల రాజు,మందారం నర్సింహులు, నర్సింహులు, కృష్ణ, సోలిపూర్ శివ,తెలంగాణ అమరుడు పాపకంటి శేఖర్ సోదరుడు కృష్ణ, తెలంగాణ జర్నలిస్ట్ ఉద్యమ కారులు మోహన్ రెడ్డి, ఖాజా పాషా(కేపి), భవాని వేణు గోపాల్, కాంగ్రెస్ పార్టీ నేతలు రఘు నాయక్, చెంది తిరుపతి రెడ్డి, బాలరాజు గౌడ్, అగ్గనూర్ బస్వం, జాకారం చంద్ర శేఖర్, మురళీ మోహన్ అప్పీ,మాణిక్యం, లింగారెడ్డి గూడ అశోక్, సీతారాం, శుక్ర వర్ధన్ రెడ్డి,గంట్ల వెల్లి గ్రామ సర్పంచ్ శివ కుమార్, మంచి రేవుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజ చేసి ఆశీర్వాదం పొందిన చేవెళ్ల నాయకులు



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 2 :-** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ ఇబ్రహీంపల్లి వార్డ్ జాజుగుట్ట హనుమాన్ దేవాలయ మొదటి వార్షికోత్సవం లో పాల్గొని పూజలు నిర్వహించిన మొయినాబాద్ మాజీ జెడ్పిటిసి కాలే శ్రీకాంత్ వారితోపాటు చేవెళ్ల పిఎసిఎస్ మాజీ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ చేవెళ్ల మండల మాజీ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జగన్ గౌడ్, దర్శన్ గౌడ్, ఫైండ్ల ప్రశాంత్ రెడ్డి, శివకుమార్ గౌడ్, కమ్మరి రవి, నడిమోల్ల మహేందర్, ఊరెళ్ళ సిహెచ్ ప్రవీణ్ లు పాల్గొని హనుమంతుని ఆశీర్వాదం పొందారు.

# టెట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి...

**అభ్యర్థులకు పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**కొత్తగూడెం జనవరి 2( స్కై న్యూస్):**జిల్లాలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలక పరీక్షలుగా, పకడ్బందీగా, పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించబడతాయి కాబట్టి, అన్ని కేంద్రాల్లో కంప్యూటర్లు, సాంకేతిక సదుపాయాలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, పవర్ బ్యాకప్ మొదలైన ఏర్పాట్లు పూర్తిగా సిద్ధం చేయబడ్డాయి అని, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రతి కేంద్రంలో టెక్నికల్ సిబ్బందిను నియమించామని కలెక్టర్ తెలిపారు.పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని, పరీక్ష సమయానికి పది నిమిషాలు ముందుగా గేట్లు మూసివేయబడతాయని అనంతరం ఎవరిని అనుమతించబోరని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఫోటో ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడి మొదలైనవి) తీసుకురావాలి అని నిషితంగా పరిశీలించిన అనంతమే పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పూర్తిగా నిషేధించబడ్డాయని, అభ్యర్థులు తమ వెంట తీసుకువచ్చే వ్యక్తిగత సామాగ్రికి తాము పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ పరీక్ష విధానాన్ని ముందుగానే తెలుసుకోవాలి పరీక్ష ప్రారంభానికి ముందు సిబ్బంది ప్రశ్నాపత్రం విధానం, సమాధానాలు నమోదు చేసే పద్ధతిని వివరించనున్నారు. పరీక్ష సమయంలో అధికారుల సూచనలను పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాయాలని కలెక్టర్ కోరారు. పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ సమయాలు ఉదయం సెషన్‌కి 7.30 గంటల నుండి 8.50 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌కి 12.30 నుండి 1.50 గంటల వరకు ఉంటాయి మరియు ఉదయం సెషన్ అభ్యర్థులను 11.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ అభ్యర్థులను 4.30 గంటలకు మాత్రమే పరీక్ష పూర్తయిన తర్వాత బయటకు పంపుతారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందుగానే గుర్తించుకోవాలని, పరీక్ష పూర్తయ్యే వరకు ఎవరికీ బయటకు వెళ్ళడానికి అనుమతి ఉండదని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# సిపిఐ వందేళ్ల ఉత్సవసభకు ఉప్పెనలా కదలిరావాలి...

**18న ఖమ్మంలో జరగనున్న సభ ప్రజాఉద్యమాలను మరింత ప్రేరణ**

**ప్రతిగడప నుంచి సిపిఐ శతాబ్ది ఉత్సావాలను తరలి రావాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**ఖమ్మం బహిరంగసభ ప్రచార గోడప్రతులను విడుదల చేసిన నాయకులు**







**కొత్తగూడెం జనవరి2( స్కై న్యూస్):** సిపిఐ శతవసంతాల ముగింపు వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 18న జరగనున్న భారీ బహిరంగ సభకు జిల్లా ప్రజలు ఉప్పెనలా కదలిరావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్'లో శుక్రవారం వేడుకలకు సంబందించిన ప్రచార గోడ ప్రతులను ప్రదర్శించి విడుదల చేశారు. ఈ సందర్బంగా సాబీర్ పాషా మాట్లాడుతూ వందేళ్ల ఉత్సవ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, ఐదు లక్షల మందితో ప్రజా ప్రదర్శన, కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ, అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకత్వం ఈ సభలో పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభ విజయవంతం అయ్యేందుకు ఈ నెల 3 నుంచి 7 వరకు జిల్లా వ్యాపితంగా ప్రచారజాతా చేపట్టబోతున్నట్లు తెలిపారు. సిపిఐ జాతీయ నాయకులు, పార్టీ కంట్రోల్ కమిషన్ కేంద్ర చైర్మన్ డాక్టర్ కె నారాయణ ప్రచారజాతాను చర్లలో ప్రారంభిస్తారని, 7న సుజాతనగర్లో జరిగే జత ముగింపు సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నారని తెలిపారు. సిపిఐ వందేళ్ల చరిత్ర ప్రజల పోరాటాలతో ముడిపడి ఉందని, కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం సాగిన ఉద్యమాలే పార్టీకి అసలైన బలం అని పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా సిపిఐ ఉద్యమం మరింత బలపడేందుకు వందేళ్ల ఉత్సావాలు దోహదపడతాయన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరగనున్న బహిరంగ సభ చారిత్రకంగా నిలవనుందని, సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. వందేళ్ల ఉత్సవాలు కేవలం వేడుకలు కాకుండా భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం కావాలని అన్నారు. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త ఈ సభను జయప్రదం చేయాల్సిన బాధ్యత వహించాలని సూచించారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాలు ప్రజా ఉద్యమాలకు నూతన ఉత్సాహం నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జి వీరాస్వామి, దమ్మాలపాటి శేషయ్య, వంగ వెంకట్, భూక్యా శ్రీనివాస్, పట్టణ నాయకులు మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, రాములు, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణాచారి, ధనలక్ష్మి, షాహీన్ మాతంగి లింగయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ సభ్యులు మల్లు రవి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 2:-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘునాయక్, పట్టణ సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డిలు ఎంపీ మల్లు రవి ని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని అంతేకాకుండా తెలంగాణలో మొదలైన ప్రభంజనం వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దేశవ్యాప్తంగా విజయభేరి మ్రోగించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి తెలిపారు ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల ప్రస్తావన కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర రాజకీయ భవిష్యత్ ప్రణాళిక అంశాలను ప్రస్తావించినట్లు రఘునాయక్ తెలిపారు ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు ప్రవచనం చేసుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు భవిష్యత్ కాలంలో ఇంకా ఎదుర్కోబోయే మున్సిపాలిటీ అదే విధంగా ప్రాదేశిక ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ జయభేరి మ్రోగించడం ఖాయం అన్న ధీమాను వారు వ్యక్తం చేశారుకాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం ఇక్కడ మొదలైనప్పుడే అక్కడ ప్రగతి భవన్ చుట్టూ నిర్మించిన ఇనుప కంచెలను బద్దలు కొట్టించడం జరిగిందినీ అక్కడ మొదలైన ప్రజా రంజక పాలన పరుగులెత్తిస్తుందని అన్నారు గడీల కోటలు బద్దలు కొట్టి అధికారం చేపట్టి మహిళలు ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించింది రేవంత్ సర్కారు రోజుకు సగటున 34 లక్షల 32 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణాలు చేస్తున్నారని 2024 ఆగస్టు 15న రైతు రుణమాఫీ చేపట్టింది 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణమాఫీ చెరువులు ప్రభుత్వ స్థలాలు నాలాలను కాపాడాలనే ఉద్దేశంతో హైడ్రాను తీసుకువచ్చామని,బహిరంగ మార్కెట్లో కిలో రూ.50 పలుకుతున్న సన్న బియ్యాన్ని రేషన్ కార్డులోని ఒక్కొక్క సభ్యుడికి ఆరు కిలోల చొప్పున ఇస్తున్నాం అని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 64 స్థానాల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ ఆ తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్ స్పష్టమైన అధిక్యం కనబరుస్తూ వచ్చిందనీ తాజాగా సర్పంచ్ ఎన్నికల్లో కూడా విజయభేరి మ్రోగించిందని అన్నారు రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలైనా కాంగ్రెస్ పార్టీ దే విజయమని పార్టీని, ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో చాకచక్యంగా నడుపుతున్నట్టు తమ మధ్య చర్చ జరిగిందని రఘునాయక్ తెలిపారు.





# పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంచాలి

**పల్లెలకు పారిశుద్ధ్యం నీరు ఆరోగ్యం అందించాలి**

**తెలంగాణ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి డిమాండ్**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్, జనవరి 2 :-** శాసనమండలిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూపల్లె సీమల్లో పారిశుద్ధ సమస్యలు తాగునీటి సమస్యలు పల్లె ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవాలని ఎమ్మెల్సీ నవీన్ నాగర్ కుంట నవీన్ రెడ్డి శాసనమండలిలో కోరారు గ్రామ పంచాయతీలలో గత పరిస్థితులకు అనుగుణంగా పారిశుద్ధ కార్మికులను ఏర్పాటు చేశారని కాకరమైన గ్రామాలు విస్తరించి అవసరాలు పెరిగాయని కానీ పారిశుద్ధ కార్మికుల సంఖ్య మాత్రం పెరగలేదని వివరించారు పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని సూచించారు అదేవిధంగా పారిశుద్ధ కార్యక్రమం కార్మికులకు కేవలం 9000 వేతనం మాత్రమే చెల్లించటం జరుగుతుందని, వారి వేతనాలను 15 వేలకు పెట్టాలని కోరారు ఇక గ్రామపంచాయతీలలో గత అవసరాలు అనుగుణంగా అప్పటి ప్రభుత్వం మిషన్ భగీరథ పైప్ లైన్లు వేసిందని, ప్రస్తుతం నీటి అవసరాలు పెరుగుతున్న దృశ్య దానిని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని వివరించారు ఇక గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కూడా సదుపాయాలు కల్పించాలని సిబ్బందిని పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

# నామాజీని సన్మానించి విరక్త మఠం స్వామి





**నారాయణపేట జనవరి 2: (స్కైన్యూస్)** నారాయణపేట సరిహద్దులోని గుర్మిత్కల్ విరక్తమఠం స్వామి మృగేశ్వర స్వామి శుక్రవారం బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నానాజీని శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాగురావు నామాజీ మాట్లాడుతు హైందవ ధర్మం సనాతన ధర్మం రక్షణ కోసం విరక్త మఠం స్వామి చేస్తున్న కృషిని కొనియాడారు.స్వామిజీ మాట్లాడుతు మఠంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని నామాజీ పాల్గొనడమే కాకుండా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మఠం నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభిషేకం

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 2 :-**షాద్ నగర్ పట్టణంలోని శివమారుతి మంది అయ్యప్ప స్వామి ఆలయంలో శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ఉదయం 6 గంటలకు మణికంఠ స్వామికి పంచామ ృతాభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపడుతున్న ఆయన ఈ సందఠరేగా ఉదయం పూజా కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు ఈ సంధఠరేగా ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర?కుంభంతో స్వాగతం పలికారు విగ్నేశ్వరునికి అర్చన, శివునుకి అభిషేకం,తదుపరి మణికంఠస్వామికి పంచామ ృతభిషేకం, అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించారు ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస క ృష?య్య, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరు బస్వమప్ప,మాణిక్యం,అంతటి కోటిలింగం స్వామి,ఎలగని వెంకటేష్ స్వామి,రేణుకుంట్ల రాజేష్ స్వామి, క్యాసెట్ శ్రీను స్వామి, కీర్తన్ స్వామి,ప్రణయ్ స్వామి,నరేష్ స్వామి,నటరాజ్ స్వామి,శివ స్వామి,కార్తీక్ స్వామి,రవి గౌడ్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీ యాలి

**ఇన్ ఛార్జీ కలెక్టర్ గా ఇక్కడికి రావడం అదృష్టం**
**జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ ప్రతీక్ జైన్.**



**నారాయణపేట జనవరి 2: (స్కైన్యూస్)**విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని, ఇలాంటి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలతో వారి ప్రతిభ కనబడుతుందని నారాయణ పేట జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. తనకు సైన్స్ అంటే చాలా ఇష్టం అని, అలాగని మిగతా సబ్జెక్టులు ఇష్టం లేదని కాదు అని అన్నారు. తాను ఓ ఇంజినీర్ అని ఆయన తెలిపారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వ ర్యంలో శుక్రవారం నారాయణ పేట మండలంలోని జాజా పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రద ర్శన ( సైన్స్ ఫేర్) కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ ఫేర్ ను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడు తూవికారాబాద్ జిల్లా కలెక్టర్ గా ఉన్న తనకు నారాయణ పేట జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ గా అదనపు బాధ్యతలు ఇచ్చారని, ఈ రోజు ఇక్కడికి రావడం అదృష్టంగా భావి స్తున్నాను అని అన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇలాంటి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. తనకూ ప్రయో గాలు చేయడం చిన్నప్పటి నుంచి అలవాటు అని, చిన్నపుడు తమ ఇంట్లో ఒక ఎలక్ట్రీషియన్ స్విచ్ బోర్డు కనెక్షన్ ఇవ్వడం చూసి తాను స్విచ్ బోర్డు రిపేర్ చేశానని, కానీ అప్పుడు బోర్డ్ మొత్తం కాలిపోయిందని చెప్పారు. చిన్నప్పటి నుంచి చిన్న చిన్న ప్రయోగాలు చేస్తుండాలని, ఫెయిల్ అయినా నేర్చుకోవా లని విద్యార్థులకు సూచిం చారు. బాటిల్ కి రంధ్రాలు పెట్టి నీళ్ళు ఎంత శాతం బయటికి వెళ్తాయో పరీక్షిం చాలన్నారు. చదువు పరంగా విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతి, సౌకర్యాలు కల్పిస్తుం దని, విద్యార్థులు ఎక్కువ సమయం తరగతి గదుల్లో గడపాలని ఆయన సూచిం చారు. జిల్లాకు చెందిన విద్యార్థులు ఎక్కడో శ్రీహరి కోటకు వెళ్లాల్సిన అవసరం లేదని, మన జిల్లా (కొడంగల్ నియోజక వర్గం)లోని కోస్గిలోనే వచ్చే విద్యా సంవత్సరం లోపు బిర్లా ప్లానిటోరియం ఏర్పాటు అవుతుందని, అలాగే దౌల్తా బాద్ లో సైన్స్ లైబ్రరీ ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. భవిష్యత్తు అంతా మీదే అని, తల్లిదండ్రుల కల నెరవేర్చేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో డ్రగ్స్ ప్రభావం ఉందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. జీడీపీ ప్రకారం మన దేశం నాలుగో స్థానంలో ఉందని, ఇంకా మెరుగు కావాల్సిన అవసరం ఉందని అన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు మంచి జ్ఞానం ఇవ్వడం మా బాధ్యత అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు గురువులకు గౌరవం ఇవ్వాలన్నారు. నిత్య జీవితంలో సైన్స్ ఒక భాగం. జాతీయ సైన్స్ ఫిక్షన్ దినోత్సవం రోజున జిల్లాలో ఇంతటి గొప్ప కార్యక్రమం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలన్నారు. కామారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్ లోనూ ప్రతిభ చాటాలని విద్యార్థులకు సూచించారు. ఇండియా, చైనా దేశాలలో రోబో ద్వారా సేవలు పొందడం జరుగుతోందని, కరోనా సమయంలో రోబోల చేత మందులు పంపించిన ఘనత కూడా ఉందని ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తెలిపారు. ఫిక్షన్ డెవలప్ త్రూ సైన్స్ అని చెబుతూ ఇలాంటి సైన్స్ ఫేర్ లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత సమాజంలో సైన్స్ ముఖ్యం అని, సైన్స్ లేనిదే జీవితం లేదు అని ట్రైనీ కలెక్టర్ స్పష్టం చేశారు. దక్షిణ భారత స్థాయితో పాటు జాతీయ అంతర్జాతీయ స్థాయి సైన్స్ ఫేర్ లలోనూ ప్రతిభ చాటి ప్రపంచానికి మనమేంటో చూపించాలన్నారు. బావి భారత శాస్త్రవేత్తలుగా జిల్లా విద్యార్థులు ఎదిగి నోబెల్ బహుమతి సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు ఆకాంక్షించారు. అంతకు ముందు రోడ్డు భద్రత మాసోత్సవాలు - 2026 పోస్టర్లను ఆర్టీవో మేఘా గాంధీతో కలిసి ఇన్ ఛార్జీ కలెక్టర్, అదనపు కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ ఆవిష్కరిం చారు. అలాగే రహదారి భద్రత నియమాలు పాటిస్తామని అందరూ సామూహిక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఇన్ ఛార్జీ కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ తో కలిసి ఇన్స్ పైర్ అవార్డ్స్ - 2024- 25 కు సంబంధించిన ప్రదర్శనలను ప్రారంభించారు. సౌర సైకిల్, బుజ్ వైర్, అంబులెన్స్ లైన్ క్లియర్, ఆటోమేటిక్ ఇంజన్ లాకింగ్ సిస్టం, ఫ్లడ్ ప్రొటెక్ట్ హోమ్, స్మార్ట్ షూ, సీలింగ్ డస్ట్ క్యాచర్ విత్ అంబ్రెల్లా, ఆటోమేటిక్ ఫాగ్ మేకర్ మిషన్, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, రి ఫారెస్టేషన్ విత్ డ్రోన్, పచ్చిరొట్టెల ఎరువులు, సూక్ష్మ జీవ నాశని - కలుపు మొక్కల తీసివేత ప్రయోగాలను కలెక్టర్ ప్రతీక్ జైన్ తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్, ఎంపీపీ శివారెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్, సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, నాగార్జున రెడ్డి, ఆర్టీవో నెంబర్ పోషల్ రాజేష్ , ఏం ఓ వో విద్యాసాగర్, సీఎంఒ రాజేంద్ర కుమార్, ఎంఈఓలు బాలాజీ, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, వెంకటయ్య, మధ్యాహ్న భోజన పథకం సమన్వయకర్త యాదయ్య శెట్టి, ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు కే. సుదర్శన్ రెడ్డి, ట్రెస్మా రాష్ట్ర కార్యదర్శి రాజేష్ కుమార్, తపస్, పి ఆర్ టి యు సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిల్లాకు చెందిన జీ హెచ్ ఎంలు పాల్గొన్నారు.

# స్వార్థమే పరమార్థం కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం



ఏటా నూతన సంవత్సర తొలి దినాన్ని, ఐక్య రాజ్య సమితి మిలీనియం డే గా, గ్లోబల్ ఫ్యామిలీ డే గా జరుపు కుంటారు. ప్రతి సంవత్సరం జనవరి 01న ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మంది ప్రపంచ కుటుంబ దినోత్స వాన్ని జరుపు కుంటారు. కుటుంబాలకు సంబంధించిన సమస్యలపై అవగాహన పెంపొందించడానికి, కుటుంబాలను ప్రభావితం చేసే సామాజిక, ఆర్థిక మరియు జనాభా ప్రక్రియల జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఈ రోజు ఒక ఉపకరిస్తుంది. కుటుంబాలు ఒక దేశం నుండి మరొక దేశానికి, అలాగే ప్రతి జాతీయ సమాజంలో విభిన్న రూపాలు, లక్షణాలను కలిగి ఉంటాయి. కుటుంబాలు వ్యక్తిగత ప్రాధాన్య తలు, సామాజిక పరిస్థితుల వైవిధ్యాన్ని తెలియ జేస్తాయి. భూమిపై ఒక గ్లోబల్ కుటుంబం అంటే వసుదైక కుటుంబంగా అందరూ శాంతి, సామరస్యంతో జీవించాలనే ఆలోచనను ప్రోత్సహించమే ఈ వంబర్ 1997లో, ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ కొత్త సహస్రాబ్ది మొదటి సంవత్సరం (2000) ప్రపంచ పిల్లల కోసం శాంతి మరియు అహింస సంస్కృతి కోసం అంతర్జాతీయ దశాబ్దాన్ని ప్రారంభించాలని ఒక ప్రకటన చేసింది. ఆ సందర్భంగా "శాంతి యొక్క ఒక రోజు"గా ప్రకటించ బడింది. అలా గ్లోబల్ ఫ్యామిలీ డేతో పాటు, జనవరి 01ని ప్రపంచ శాంతి దినోత్సవంగా కూడా పాటిస్తారు. కుటుంబం అంటే ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్న వారు. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. భారతీయ సంస్కృతికి, సంప్రదా యాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరిక ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లింది. రక్త సంబం ధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు ఇమిడి ఉన్నాయి. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగా యనడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అంద రిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉంటే ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదం డ్రులు, అత్తమామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మర దళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్ర తో కళకళలాడే ఉమ్మడి కుటుం బాలు సిరి సంపదల నిల యాలు. పిల్లలు చిన్న వయస్సులో ఉన్న పుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుం బాలు వారివే అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించి నప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబంను అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకో వడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించు కునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు, రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో కేవలం ఫోన్ లోనో, మొబైల్లోనో యోగక్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టిల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశ యోక్తి కాదు. అనేక కుటుంబాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించు కునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసు కోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహా లిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసు లోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కని పించే దృశ్యం. కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖ శాంతులు నెలకొల్పడం కోసం స్వచ్ఛంద సంస్థలు కూడా కృషి చేయాల్సి ఉంది.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట జనవరి 2:( స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 30పోలీస్ యాక్ట్ అమలులో ఉందని జిల్లా ఎస్పి డాక్టర్ వినీత్ తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమా వేశాలు, బహిరంగ కార్యక్ర మాలు, సభలు జిల్లాలో నిషేధం అని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ జనవరి 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అను మతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవస రమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసుల ను నమోదు చేయబడతా యని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనాఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించా లన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## పట్టడం నడిబొడ్డున ఒరిగిన విద్యుత్ పోల్, పొంచి ఉన్న ప్రమాదం




**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ జనవరి 2 :-** షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా త్రిశూల్ వైన్స్ వద్ద చటాన్ పల్లి వైపు వెళ్లే మెయిన్ రోడ్డు ముక్క కూడలి ప్రక్కన ఉన్న ఒక విద్యుత్ స్తంభం ఇరిగి ప్రమాదకరంగా మారింది పైన ఉన్న విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి ఒకవేళ స్తంభం రోడ్డు పై పడితే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది ఈ రోడ్డుపై ముఖ్యమైన మెయిన్‌రోడ్డు కావడంతో ప్రతి నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి విరిగిన స్తంభం ఒకవేళ రోడ్డు మీద పడితే ఎవరు ఊహించని భారీ ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి వెంటనే సరిచేయకపోతే ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు విద్యుత్ అధికారులు స్పందించి తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని ప్రయాణికులు వాహనదారులు పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

## రాష్ట్ర మహాసభలకు తరలిన ఏబీవీపీ నేతలు



**నాగర్ కర్నూల్ జనవరి 2( స్కైన్యూస్)** మూడు రోజులపాటు శంషాబాద్ లో జరిగే ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు శుక్రవారం జిల్లా కేంద్రం నుండి ఏబీవీపీ నాయకులు తరలి వెళ్లారు ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు మాట్లాడుతూ రాష్ట్ర 44వ మహాసభలను విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున విద్యార్థి లోకం తరలిరావాలని కోరారు. ఈ మహాసభలలో రాష్ట్రవ్యాప్తంగా గత సంవత్సరం నిర్వహించిన ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకొని విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్ నగర సంయుక్త కార్యదర్శి శివ మల్లేష్ జిల్లా కే లో భరత్ కన్వీనర్ రమేష్ నాయకులు విష్ణు శివా జీవన్ బాలికల కమిటీ ఇన్చార్జి కీర్తన దేవిక తదితరులు పాల్గొన్నారు

## ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం జనవరి 2( స్కై న్యూస్):**శుక్రవారం నాడు ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా శు క్రవారం సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినరాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్

**కొత్వాలపాల్వంచ జనవరి 2( స్కై న్యూస్):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఐ డీ ఓ సి లోని కలెక్టర్ కార్యాలయంలో కొత్వాలతోపాటు కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి, బొకేలతో కలెక్టర్ ను సత్కరించారు. అడిషనల్ కలెక్టర్ విద్య చందనకు శుభాకాంక్షలు తెలిపిన కొత్వాల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) డీఆర్డీఓ విద్య చందనకు కొత్వాల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు మహీపతి రామలింగం, వై వెంకటేశ్వరరావు, పైడిపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వంట నూనెను పదే పదే వేడి చేసి వాడుతున్నారా?



భారతీయ ఇళ్లలో వంట నూనె లేని రోజు ఉండదు. పచ్చడి, పులుసు, కూరలు, చిరుతిళ్లు – ఏ వంటకమైనా నూనెతోనే మొదలవుతుంది. ముఖ్యంగా డీప్ ఫ్రై చేసే పదార్థాల తర్వాత మిగిలిన నూనెను వడకట్టి మళ్లీ వాడేస్తుంటారు చాలా మంది. డబ్బు ఆదా అవుతుందని భావిస్తారు. కాచిన నూనెను మళ్లీ వాడే అలవాటు ఆరోగ్యానికి ఎంత ప్రమాదమో తెలుసా? పదే పదే వేడి చేసిన నూనెలో విషపదార్థాలు ఏర్పడతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవి శరీరంలోకి చేరి ఏం చేస్తాయి? ఏ రోగాలకు దారి తీస్తాయి? చాలా మంది ఇళ్లలో డీప్ ఫ్రై చేసిన నూనెను నిల్వ చేసుకుని మరుసటి రోజు కూడా వాడతారు. ఇది సాధారణ అలవాటుగా మారింది. కానీ, ఈ ప్రక్రియలో నూనెలో రసాయన మార్పులు జరుగుతాయి. అధిక ఉష్ణోగ్రతకు గురైన నూనెలో ఫ్రీ రాడికల్స్, ట్రాన్స్ ఫ్యాట్స్, ఆల్డిహైడ్స్ వంటి హానికర సమ్మేళనాలు పెరుగుతాయి. ఇవి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని పెంచి, కణాలను దెబ్బతీస్తాయి. ఫలితంగా గుండె జబ్బులు, డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది? మరి ఈ ప్రమాదం నుంచి ఎలా తప్పించుకోవాలి? నూనెను పదే పదే వేడి చేయడం వల్ల దానిలోని కొవ్వు ఆమ్లాలు విచ్ఛిన్నమై ఫ్రీ రాడికల్స్‌ను విడుదల చేస్తాయి. ఈ ఫ్రీ రాడికల్స్ శరీరంలోకి చేరి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను అసమతుల్యం చేస్తాయి. ధమనుల్లో ప్లాక్ పేరుకుపోవడం, వాపులు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత పెరగడం వంటివి జరుగుతాయి. కాలక్రమేణా ఇవి గుండె జబ్బులు, టైప్-2 డయాబెటిస్, ఫ్యాటీ లివర్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారి తీస్తాయి. పరిశోధనల ప్రకారం.. అధిక ఉష్ణోగ్రతలకు గురైన నూనెలో పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్‌వంటి కార్సినోజెన్స్ కూడా ఏర్పడతాయి.

వాడిన నూనెను నిల్వ చేసే విధానంలోనూ చాలా మంది తప్పులు చేస్తారు. మూత పెట్టకుండా, వెలుతురు పడే చోట ఉంచితే ఆక్సీకరణ వేగంగా జరిగి ఫ్రీ రాడికల్స్ మరింతగా పెరుగుతాయి. మళ్లీ వాడాలనుకుంటే తాజా నూనెతో కలిపి వాడవచ్చు కానీ, అందులోని విష సమ్మేళనాలు పూర్తిగా తొలగిపోవు. పొద్దుతిరుగుడు నూనెకు బదులుగా పల్లి నూనె, ఆవ నూనె (మస్టర్డ్ ఆయిల్), కొబ్బరి నూనె, నెయ్యి వంటివి ఉపయోగించండి. ఇవి హై స్మోక్ పాయింట్ ఉండి, డీప్ ఫ్రైకు సురక్షితం. నెలకు ఒకసారి నూనె రకాన్ని మార్చడం వల్ల ఒమెగా-3, ఒమెగా-6 ఫ్యాటీ యాసిడ్స్ సమతుల్యత కాపాడబడుతుంది. ఈ చిన్న మార్పులతో గుండె, కాలేయం, మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మీ వంటశైలి మార్చుకుంటే.. ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుంది!

# అతిగా తింటే మెదడుకు హాని జరుగుతుందా?

మనం ఫుడ్ తినేటప్పుడు మన శరీరం నుంచి కొన్ని సిగ్నల్స్ విడుదలై అవన్నీ కలిపి కడుపు నిండిందని మెదడుకు ఒక సిగ్నల్ ఇస్తాయి. ఇందులో మన పేగులు జీవక్రియలు చేసే శక్తిని ఉత్పత్తి చేసే అణువులు హార్మోన్లు అన్నీ ఉంటాయి. ఈ హార్మోన్లనే పాంక్రియాస్ గ్రంథికి ఇన్సులిన్ విడుదల చేయాలని సిగ్నల్స్ ఇస్తాయి. సాధారణంగా మనం తినాలనే కోరిక కలిగితే.. అది ఇష్టమైన ఫుడ్ అయితే.. బాగా లాగించేస్తాం.. ఇంకా ఏదైనా పండుగ వచ్చిందంటే చాలా స్పెషల్‌గా ఫుడ్ రెడీ చేసుకుని ఎంతో ఇష్టంగా తింటాం. ఇలాంటి ఫెస్టివల్ డేస్‌లో చాలామంది ఇష్టమైన డైట్ ప్లాన్‌లన్నీ పక్కనపెట్టి మంచిగా ఫుడ్ లాగిస్తుంటారు.



అయితే మనం తీసుకున్న ఆహారం మనం మెదడులో ఎన్నో ముఖ్యమైన పనులు చేసేందుకు ఉపయోగపడుతుంది. ఇందులో మన మెమరీ పవర్ ఏకాగ్రత వంటి అంశాలు కూడా ఉన్నాయి. సరైన విధంగా పద్ధతిగా తీసుకునే ఆహారం మన మానసిక ఆరోగ్యానికి కూడా సహాయంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. మనం ఫుడ్ తినేటప్పుడు మన శరీరం నుంచి కొన్ని సిగ్నల్స్ విడుదలై అవన్నీ కలిపి కడుపు నిండిందని మెదడుకు ఒక సిగ్నల్ ఇస్తాయి. ఇందులో మన పేగులు జీవక్రియలు చేసే శక్తిని ఉత్పత్తి చేసే అణువులు హార్మోన్లు అన్నీ ఉంటాయి. ఈ హార్మోన్లనే పాంక్రియాస్ గ్రంథికి ఇన్సులిన్ విడుదల చేయాలని సిగ్నల్స్ ఇస్తాయి. ఇది మన శరీరంలో చక్కర స్థాయిలను నియంత్రిస్తుంది. ఈ సిగ్నల్స్ అన్నీ మన పేగులలోని అన్ని భాగాల నుండి వస్తుంటాయి. పాంక్రియాస్ గ్రంథి ద్వారా విడుదల ఈ హార్మోన్ల నమూనా, వీటి నుంచి మెదడుకు వెళ్లే సంకేతాలు కడుపు నిండిన తర్వాత మనకు కలిగించే నిద్ర మత్తు సంబంధించినవి. కానీ ఖచ్చితంగా ఈ ప్రక్రియ ఎలా పనిచేస్తుంది అనే దానిపై ఇంకా చాలా రీసెర్చ్ చేయాలని వాషింగ్టన్ డిసి లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు తెలిపారు. అయితే ఎక్కువగా తిన్న తర్వాత రక్తప్రసరణ తగ్గదు అని పరిశోధనలు చెబుతున్నాయి. ఒకేసారి ఎక్కువగా తిన్న కూడా మన మెటబాలిజంపై కాస్త తక్కువ ప్రభావమే పడుతుందని పరిశోధకులు అంటున్నారు. పరిశోధకులు చేసిన అధ్యయనం ప్రకారం.. అప్పుడప్పుడు ఎక్కువగా తినడం అందరూ అనుకున్నంత ప్రమాదకరం కాదు అని తెలిపారు. అయితే ఈ అధ్యయనాన్ని కేవలం యువతపైనే, ఆరోగ్యకరమైన వ్యక్తులపైనే చేశామని దీనిపై మరింత పరిశోధన చేయాల్సి ఉందని వారు అంటున్నారు. ఎక్కువగా తినడం వల్ల చెడు ప్రభావం పడుతుందన్న గ్యారెంటీ లేదని పరిశోధకులు తెలిపారు. ఒక్కసారి అత్యధికంగా ఆహారాన్ని తీసుకోవడం వల్ల మన శరీరంపై జరిగే ప్రభావాలపై తక్కువ పరిశోధనలు ఉన్నప్పటికీ ప్రస్తుతం పరిశోధనలు మాత్రం మన మెదడుకి అంత ప్రమాదకరం కాదని సూచిస్తున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఒకసారి ఎక్కువగా తినడం మనం అనుకున్నంత ప్రమాదం కాదని నిపుణులు అంటున్నారు. అప్పుడప్పుడు ఎక్కువగా తినడం ఓకే కానీ అంతకుమించి తింటే శరీరంపై ఒత్తిడి పెరుగుతుందని.. వరుసగా ఐదు రోజులపాటు ఎక్కువగా తినడం వల్ల మన మెదడుపై దీర్ఘకాలిక ప్రభావాలు పడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రోజూ ఇలా నడిస్తే కొవ్వు మంచులా కరుగుతుంది



నేటి కాలంలో బరువు తగ్గడం అనేది ఒక పెద్ద సవాలుగా మారింది. దీని కోసం చాలా మంది జిమ్‌లో గంటల తరబడి చెమటలు చిందిస్తుంటారు. మరికొందరు కఠినమైన ఆహార నియమాలు పాటిస్తుంటారు. అయితే అవేమీ లేకుండా కేవలం నడకతోనే బరువు తగ్గవచ్చని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా నడవటం కాకుండా కొన్ని చిట్కాలను పాటిస్తే సులభంగా స్లిమ్‌గా మారవచ్చు. నడక ప్రయోజనాలు: నడక కేవలం కేలరీలను బర్న్ చేయడమే కాకుండా శరీర జీవక్రియను వేగవంతం చేస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అన్ని వయసుల వారు చేయగలిగే అత్యుత్తమ వ్యాయామం ఇది. క్రమం తప్పకుండా నడవడం వల్ల కీళ్ల నొప్పుల ముప్పు కూడా తగ్గుతుంది. భోజనం తర్వాత: చాలా మంది తిన్న వెంటనే పడుకుంటారు. కానీ భోజనం చేసిన తర్వాత 10 నుండి 20 నిమిషాల పాటు వేగంగా నడవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, కొవ్వు పేరుకుపోకుండా ఉండటానికి సహాయపడుతుంది. పవర్ వాకింగ్: సాధారణంగా నడవడానికి, పవర్ వాకింగ్‌కు చాలా తేడా ఉంది. కొంచెం వేగంగా, చేతులను లయబద్ధంగా ఆడిస్తూ నడవడాన్ని పవర్ వాకింగ్ అంటారు. దీనివల్ల హృదయ స్పందన రేటు పెరిగి, కేలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఇది మోకాళ్లపై తక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. మెట్లు ఎక్కడం: చదునైన నేలపై నడవటం కంటే మెట్లు ఎక్కడం లేదా ఎత్తు పల్లాల ఉన్న చోట నడవడం వల్ల ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. ఇది మీ తొడలు మరియు పొట్ట కండరాలపై ఒత్తిడిని పెంచి, మొండి కొవ్వును సైతం కరిగించేలా చేస్తుంది. కొంచెం బరువుతో నడక: నడుస్తున్నప్పుడు వెనుక చిన్న బ్యాక్‌ప్యాక్ ధరించడం లేదా తేలికపాటి బరువులు చేతిలో పట్టుకోవడం వల్ల శరీరం మరింత కష్టపడాల్సి వస్తుంది. దీనివల్ల తక్కువ సమయంలోనే ఎక్కువ కేలరీలు బర్న్ అవుతాయి. ఇంటర్వెల్ వాకింగ్: ఒకే వేగంతో కాకుండా వేగాన్ని మారుస్తూ నడవండి. ఉదాహరణకు ఒక నిమిషం పాటు చాలా వేగంగా నడిచి, తర్వాతి నిమిషం నెమ్మదిగా నడవండి. ఇలా చేయడం వల్ల శరీరంలో కొవ్వు కరిగే ప్రక్రియ రెట్టింపు అవుతుంది.

# ఆమ్లెట్, ఉడికించిన గుడ్డు బరువు తగ్గడానికి ఏది మంచిది?





ప్రోటీన్‌కు గుడ్లు ఉత్తమం. అందుకే డైలీ గుడ్లు తినమని వైద్యులు సూచిస్తారు. అయితే బరువు తగ్గాలనుకునేవారికి ఉడికించిన గుడ్లు, ఆమ్లెట్‌లలో ఏది మంచిదనే సందేహం ఉంటుంది. ప్రోటీన్ పుష్కలంగా ఉండే ఆహారాల్లో గుడ్డుకు సాటిలేదు. అందుకే చాలా మంది తమ అల్పాహారంలో గుడ్లను ఖచ్చితంగా చేర్చుకుంటారు. అయితే గుడ్లను వండుకునే విధానాన్ని బట్టి వాటిలోని పోషకాలు, కేలరీల శాతం మారుతుంటాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఉడికించిన గుడ్డు మంచిదా లేక ఆమ్లెట్ మంచిదా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. ఆరోగ్యపరంగా చూస్తే ఉడికించిన గుడ్డు అత్యుత్తమ ఎంపిక. దీనిని నూనె లేదా వెన్న లేకుండా కేవలం నీటిలో ఉడికిస్తారు. కాబట్టి అదనపు కొవ్వు చేరే అవకాశం లేదు. ఒక ఉడికించిన గుడ్డులో సుమారు 70 కేలరీలు మాత్రమే ఉంటాయి. ఇందులో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని ఇస్తూనే బరువును నియంత్రణలో ఉంచుతాయి. ప్రయాణాల్లో కూడా వీటిని సులభంగా తీసుకువెళ్లవచ్చు. ఆమ్లెట్ తినడానికి చాలా రుచిగా ఉంటుంది.. కానీ దీని తయారీ విధానమే పెద్ద మైనస్. ఆమ్లెట్ వేయడానికి నూనె, నెయ్యి లేదా వెన్న వాడటం వల్ల కేలరీల శాతం పెరుగుతుంది. ఉపయోగించే నూనెను బట్టి ఒక ఆమ్లెట్‌లో 90 నుండి 200 కేలరీల వరకు ఉండే అవకాశం ఉంది. అయితే ఆమ్లెట్‌లో టమోటాలు, ఉల్లిపాయలు, పాలకూర, క్యాప్సికమ్ వంటి కూరగాయలు చేర్చడం వల్ల ఫైబర్, విటమిన్లు అందుతాయి. తక్కువ నూనెతో వేసుకుంటే ఇది కూడా మంచి పోషకాహారమే. బరువును వేగంగా తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న వారు ఉడికించిన గుడ్లు తినడమే ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే వీటిలో కొవ్వు శాతం చాలా తక్కువ. ఒకవేళ మీరు ఆమ్లెట్ తినాలనుకుంటే.. నాన్-స్టిక్ పాన్ ఉపయోగించి అతి తక్కువ నూనెతో, ఎక్కువ కూరగాయలు చేర్చి వండుకోవడం మంచిది. దీనివల్ల కడుపు ఎక్కువసేపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది.

# క్యాబేజీలో ఇంత మ్యాటర్ ఉందా.. ఇది తెలిస్తే అస్సలు ముట్టుకోరు..



క్యాబేజీ దొరికింది కదా అని పచ్చిగా తినేస్తున్నారా.? అయితే కాస్త ఆగండి.! అలా తినడం వల్ల లేనిపోని రోగాలు కొనితెచ్చుకున్నట్టే. దీనిపై న్యూరాలజిస్ట్ హెచ్చరికలు జారీ చేశారు. ఆ వివరాలు ఏంటో ఇప్పుడు ఈ స్టోరీలో తెలుసుకుందామా మరి. మూర్ఛ బ్రెయిన్‌కు సంబంధించిన ఒక వ్యాధి. మెదడు పనితీరుకు సంబంధించి ఏదైనా ఆటంకం ఏర్పడినప్పుడు ఫిట్స్ వస్తుంది. ఫిట్స్ వచ్చినప్పుడు.. అవయవాలు వణకడం, ఆకస్మికంగా పడిపోవడం, తదేకంగా చూడటం, ఆందోళన, స్పృహ కోల్పోవడం, సైకోసిస్ వంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు వైద్యులు. ఫిట్స్ చిన్న వయసులో బాధించడానికి పలు కారణాలని అంటున్నారు. అలాగని.. పెద్దయ్యాక రాదని చెప్పలేం. ఇది జీవితంలో ఎప్పుడైనా రావొచ్చంటున్నారు నిపుణులు. ఇది వారసత్వంగా తల్లితండ్రుల నుంచి సంక్రమిస్తుందా? ఆహారం ద్వారా మెదడులోకి చేరే పురుగులు కారణమా? తల్లిదండ్రులకు మూర్ఛ సమస్య ఉంటే అది పిల్లలకు వచ్చే ప్రమాదం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు నిపుణులు. కొన్నిసార్లు మూర్ఛ వ్యాధిగ్రస్థులను ఆసుపత్రికి తీసుకెళ్లినా.. చికిత్స చివరి వరకు కొనసాగించకుండా మధ్యలోనే వదిలేస్తారంటున్నారు. ఈ కారణంగా వ్యాధి మరింత తీవ్రంగా మారుతుంది. అలాకాకుండా.. సమయానికి చికిత్స అందిస్తే 80 నుంచి 90 శాతం మూర్ఛ రోగులలో ఈ వ్యాధి కంట్రోల్ అవుతుందని చెబుతున్నారు. అలాగే క్యాబేజ్ ఆకులను వండకుండా పచ్చిగా తినడం వల్ల టీనియా సోలియం అనే పురుగు గుడ్లు మెదడులోకి చేరతాయని వాటి కారణంగా ఏర్పడే ఇన్ఫెక్షన్ తో మూర్ఛవ్యాధి రావచ్చని హెచ్చరించారు. న్యూరో సిస్టి సెర్కోసిస్ నివారించదగ్గ ఇన్‌ఫెక్షన్ అని ఢిల్లీ ఎయిమ్స్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక సెహ్రావత్ తెలిపారు. ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే ఈ సమాచారాన్ని మేం మీకు అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# బిజినెస్

## రెండేళ్ల గరిష్టానికి పారిశ్రామికోత్పత్తి



దేశ పారిశ్రామికోత్పత్తి వృద్ధి నవంబర్‌లో 6.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది రెండేళ్ల గరిష్ట స్థాయి. మైనింగ్, తయారీ వంటి రంగాల్లో మెరుగైన పనితీరు కారణంగా పారిశ్రామికోత్పత్తి గణనీయంగా పుంజుకుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) సోమవారం ప్రకటనలో వెల్లడించింది. గతేడాది ఇదే నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 5 శాతం పెరిగింది. ఎన్ఎస్ఓ గణాంకాల ప్రకారం, సమీక్షించిన నెలలో తయారీ రంగం 8 శాతం పుంజుకుంది. ఇది గతేడాది నవంబర్‌లో 5.5 శాతంగా ఉంది. వర్షాకాలం ముగియడంతో పాటు ఇనుప ఖనిజం వంటి లోహ ఖనిజాల ఉత్పత్తి పెరగడం వల్ల మైనింగ్ ఉత్పత్తి ఈ నవంబర్‌లో 5.4 శాతంగా నమోదైంది. గతేడాది ఇది 1.9 శాతం పెరిగింది. అయితే, విద్యుదుత్పత్తి గత నెలలో 1.5 శాతం క్షీణించింది. గతేడాది ఇది 4.4 శాతం వృద్ధి సాధించింది. మొత్తంగా ఐఐపీ సూచీ పుంజుకోవడం అక్టోబర్‌లో పండుగ సీజన్ కారణంగా నెమ్మదించిన తర్వాత పారిశ్రామిక రంగాల్లో ఉత్పత్తి గణనీయంగా మెరుగుపడటాన్ని సూచిస్తుందని ప్రభుత్వ గణాంకాలు పేర్కొన్నాయి.

## దేశీయ విమానయాన పరిశ్రమకు రూ. 18,000 కోట్ల నష్టం



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ విమానయాన రంగం భారీ కష్టాలను చూసింది. ప్రయాణికుల రద్దీ తగ్గడంతో పాటు ఇతర కారణాల వల్ల ఈ రంగం రూ. 17,000–18,000 కోట్ల నష్టాలను చూసే అవకాశాలు ఉన్నాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సోమవారం ప్రకటనలో తెలిపింది. ఇదివరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ రంగం రూ. 9,500–10,500 కోట్ల నష్టం ఎదురవ్వొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేసింది. కానీ, ఇది దాదాపు రెట్టింపునకు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లో ఎయిర్ ఇండియా బోయింగ్ 787–8 విమాన ప్రమాదం, ఈ నెల ప్రారంభంలో ఇండిగో వేలాది విమానాలను రద్దు చేయడం వంటి అనేక సంక్షోభాల వల్ల ఈ ఆర్థిక సంవత్సరానికి దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ అంచనాను ఇక్రా 0–3 శాతానికి తగ్గించింది. దీన్ని గతంలో 4–6 శాతంగా అంచనా వేసింది. ఏప్రిల్–నవంబర్ మధ్య ఊహించిన దానికంటే చాలా తక్కువ విమాన ప్రయాణాల రద్దీ ఉందని, ఇందుకు సరిహద్దు ఉద్రిక్తతలు ఎక్కువగా ఉండటమే కారణని ఇక్రా అభిప్రాయపడింది. మరోవైపు ఎక్కువ సంఖ్యలో విమానాల రాకపోకలు అంతరాయం, రద్దు, జూన్‌లో ఎయిర్‌ఇండియా విమాన ప్రమాం వంటి పరిణామాలు ఎక్కువ ప్రభావితం చేశాయని పేర్కొంది.

# భారత రక్షణ రంగంలో అదానీ గ్రూప్ భారీ ముందడుగు



భారతదేశ రక్షణ రంగ స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అదానీ గ్రూప్ ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. సుమారు రూ. 1.8 లక్షల కోట్ల భారీ పెట్టుబడులతో రక్షణ ఉత్పత్తుల తయారీలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించనుంది. వచ్చే ఏడాది నుంచి ఈ పెట్టుబడులు కార్యరూపం దాల్చనున్నాయి, తద్వారా మేక్ ఇన్ ఇండియా నినాదానికి మరింత ఊతం లభించనుంది. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో భారత రక్షణ రంగాన్ని నిలబెట్టడమే లక్ష్యంగా ఈ సంస్థ అడుగులు వేస్తోంది. ముఖ్యంగా భవిష్యత్ యుద్ధ తంత్రాలకు అవసరమైన మానవరహిత విమానాలు, అడ్వాన్స్‌డ్ గైడెడ్ వెపన్ సిస్టమ్స్ తయారీపై అదానీ గ్రూప్ ప్రత్యేక దృష్టి సారించనుంది. శత్రువుల కదలికలను పసిగట్టే స్మార్ట్ సెన్సార్లు, అధునాతన ఎలక్ట్రానిక్స్ మరియు ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించే క్షిపణి వ్యవస్థల అభివృద్ధిని వచ్చే ఏడాది నుంచి వేగవంతం చేయనున్నారు. ఈ స్వదేశీ తయారీ వల్ల విదేశీ దిగుమతులపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది. రక్షణ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం పెరగడం వల్ల సైన్యానికి అత్యాధునిక ఆయుధాలు త్వరగా అందుబాటులోకి రానున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత యుద్ధ సాంకేతికతను ప్రవేశపెట్టడం ఈ భారీ పెట్టుబడుల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. సరిహద్దుల్లో కాపలా కాసే సైనికుల ప్రాణాపాయాన్ని తగ్గించడానికి, మనుషుల ప్రమేయం లేకుండా పోరాడే రోబోటిక్ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. యుద్ధ క్షేత్రంలో తలెత్తే క్లిష్ట పరిస్థితులను ాూ× ద్వారా విశ్లేషించి, తక్కువ నష్టంతో శత్రువును ఎదుర్కొనేలా సాంకేతికతను తీర్చిదిద్దనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని యుద్ధ తంత్రాలతో జోడించడం వల్ల భారత సైన్యం మరింత పటిష్టం కానుంది. అదానీ గ్రూప్ ఇప్పటికే రక్షణ రంగంలో తన ఉనికిని చాటుకుంటూ కీలక విజయాలను నమోదు చేసింది. ఈ సంస్థ అభివృద్ధి చేసిన 'దృష్టి–10' స్టార్‌లైనర్ వంటి అత్యాధునిక మానవరహిత విమానాలు ప్రస్తుతం భారత నౌకాదళంలో చురుకైన సేవలందిస్తున్నాయి. కేవలం గూఢచర్యానికే కాకుండా, నిఘా మరియు నిరంతర నిఘా కార్యకలాపాల్లో ఇవి అత్యంత కీలకంగా మారాయి. భవిష్యత్తులో మరిన్ని వినూత్న ఉత్పత్తులతో భారత త్రివిధ దళాలకు అండగా నిలవాలని అదానీ గ్రూప్ పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

# భారీగా తగ్గిన వెండి ధర.. రూ.21వేలు పతనం



వెండి ధర భారీగా తగ్గింది. ఇప్పటి వరకూ ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన ధరకు బ్రేక్ పడింది. ఫ్యూచర్ మార్కెట్‌లో ఒక్కసారిగా కిందకు పడింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి కాంట్రాక్ట్ వెండి కిలో ధర గంటలోనే రూ.21 వేలు మేర తగ్గింది. సోమవారం ఇంట్రాడేలో రూ.2,54,174 వద్ద గరిష్టాన్ని తాకిన కిలో వెండి ధర రూ.2,33,120 వద్ద కనిష్టాన్ని తాకింది. అటు స్పాట్ మార్కెట్‌లో కూడా వెండి ధర దిగి వచ్చింది. రూ.2.50 లక్షలు పైబడి పలికిన కేజీ వెండి ధర హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మధ్యాహ్నం 3 గంటల సమయానికి రూ.2.39 లక్షల స్థాయికి దిగి వచ్చింది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా ఇటీవల బంగారం, వెండికి ఎక్కడా లేని డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా వెండి ఎన్నడూలేని రీతిలో దూసుకెళ్లింది. అంతర్జాతీయ మార్కెట్‌లో 50 డాలర్ల దిగువనే ట్రేడవుతూ వచ్చిన వెండి ఒక్కసారిగా ఇటీవల భారీగా దూసుకెళ్లింది. దీంతో సోమవారం ఓ దశలో 80 డాలర్లు పైకెగిసింది. గరిష్టాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కారణంగా భారీగా దిగి వచ్చింది. రష్యా – ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో కీలక అడుగు పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ అయ్యారు. శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు పుతిన్, జెలెన్‌స్కీ ఇద్దరూ పూర్తి సుముఖంగా ఉన్నట్లు ట్రంప్ ప్రకటించడం యుద్ధానికి తెరపడుతుందన్న అంచనాల వేళ వెండి ధర పతమైంది. ప్రపంచంలో అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్‌లను నిర్వహిస్తోంది. 2026 మార్చి ఫ్యూచర్ కాంట్రాక్ట్‌కు సంబంధించిన మార్జిన్‌ను 20వేల డాలర్ల నుంచి 25వేల డాలర్లకు పెంచింది. దీంతో అధిక రిస్క్ తీసుకునే వారు వెనకడుగు వేయడంతో వెండిలో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి పెరగడానికి కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు.

# నిజాన్ని మీరే బయటపెట్టాలి రోహిత్, కోహ్లీకి మాజీ క్రికెటర్ విజ్ఞప్తి



టీమిండియా బ్యాటింగ్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వారం వ్యవధిలోనే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ ఏడాది మే నెలలో తొలుత రోహిత్ తన నిర్ణయాన్ని వెల్లడించగా.. కోహ్లీ కూడా అదే బాటలో నడిచాడు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బోర్డర్– గావస్కర్ ట్రోఫీలో వీరిద్దరు పరుగులు రాబట్టలేక ఇబ్బందిపడ్డారు. రోహిత్ మధ్యలో విరామం తీసుకుంటూ మ్యాచ్‌లు ఆడగా.. కోహ్లీ పదే పదే ఆఫ్ స్టంప్ దిశగా వెళ్తున్న బంతిని ఆడే క్రమంలో దాదాపుగా ఎనిమిది సార్లు వికెట్లు పారేసుకున్నాడు. ఈ నేపథ్యంలో రో– కో ఆట తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. రోహిత్ టెస్టులకు స్వస్తి పలికితే బాగుంటుందనే డిమాండ్లు పెరగగా.. మేటి టెస్టు బ్యాటర్ అయిన కోహ్లీ తప్పులను సరిదిద్దుకుంటే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

**అనూహ్య రీతిలో**

ఈ క్రమంలో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025–27లో భాగంగా తొలుత ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో టీమిండియాలో రో– కో ఆడతారని ముందుగా సంకేతాలు వచ్చాయి. అయితే, అనూహ్య రీతిలో వీరిద్దరు టెస్టులకు గుడ్‌బై చెప్పేశారు. రోహిత్ శర్మ స్థానంలో టెస్టు పగ్గాలు చేపట్టిన శుబ్‌మన్ గిల్.. బ్యాటింగ్ ఆర్డర్‌లో కీలకమైన కోహ్లీ నాలుగో స్థానాన్నీ భర్తీ చేశాడు.

**ఒత్తిడి చేశారు**

అయితే, రోహిత్– కోహ్లీ ఆకస్మిక రిటైర్మెంట్లపై భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ఇదైతే సహజమైన రిటైర్మెంట్‌లా అనిపించలేదు. ఈ విషయంలో వాళ్లు మాత్రమే నిజమేంటో చెప్పగలరు. నాకైతే ఇదేదో బలవంతంగా చేయించినట్లు అనిపిస్తోంది.

**నిజాన్ని మీరే బయటపెట్టాలి**

రోహిత్ శర్మ ఆరు నెలల పాటు విరామం తీసుకుని.. ఫిట్‌నెస్ సాధించి తిరిగి వస్తే బాగుండేది. అదే జరిగితే తిరిగి అతడు ఫామ్‌ను అందుకునేవాడు. అతడిలో ఇంకా క్రికెట్ మిగిలే ఉంది. రోహిత్‌తో పాటు కోహ్లీ కూడా కొన్నాళ్ల విరామం తర్వాత తిరిగి వస్తే బాగుండేది. ఏదేమైనా టెస్టు రిటైర్మెంట్ విషయమై వాళ్లు నోరు విప్పితేనే నిజం తెలుస్తుంది" అని రాబిన్ ఊతప్ప పేర్కొన్నాడు.

**ఇద్దరూ సిద్ధం**

అదే విధంగా.. రోహిత్ శర్మ– విరాట్ కోహ్లీ ప్రస్తుత ఫామ్ గురించి ప్రస్తావిస్తూ.. "సౌతాఫ్రికాతో వన్డేల్లో ఇద్దరూ అదరగొట్టారు. రోహిత్ అద్భుతమైన హాఫ్ సెంచరీలు సాధిస్తే.. కోహ్లీ వరుసగా రెండు శతకాలు బాదాడు. ఇద్దరూ ప్రపంచకప్ టోర్నీకి సిద్ధంగా ఉన్నారు. ఇటీవలే రోహిత్‌ను కలిశాను. అతడు ప్రస్తుతం రిలాక్సింగ్ మోడ్‌లో ఉన్నాడు. ఆట పట్ల సంతృప్తిగా ఉన్నాడు. రోహిత్– విరాట్ పరుగుల దాహం ఇంకా తీరలేదు. ఇప్పటికే ఇద్దరూ దిగ్గజాలుగా పేరు తెచ్చుకున్నారు. అయినా సరే ఇంకా ఇంకా ఆడాలనే పట్టుదల వారిని మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది" అని రాబిన్ ఊతప్ప చెప్పుకొచ్చాడు.

## ఆర్సీబీకి భారీ షాకిచ్చిన ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్

వచ్చే ఏడాది (2026) జనవరి 9 నుంచి ప్రారంభం కాబోయే మహిళల ఐపీఎల్ 2026కు ముందు 2024 ఎడిషన్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్, ఆస్ట్రేలియా ప్లేయర్ ఎల్లిస్ పెర్రీ వ్యక్తిగత కారణాల చేత సీజన్ మొత్తానికి దూరం కానుంది. పెర్రీ స్థానాన్ని ఆర్సీబీ యాజమాన్యం దేశీయ ఆల్‌రౌండర్ సయాలీ సత్ఘరేతో భర్తీ చేసింది. సత్ఘరే గతంలో గుజరాత్ జెయింట్స్ తరపున ఆడింది. ఈ సీజన్ వేలంలో సత్ఘరేను (30 లక్షలు) ఏ ఫ్రాంచైజీ తీసుకోలేదు. తాజాగా ఎల్లిస్ లీగ్ నుంచి తప్పుకోవడంతో సత్ఘరేను అదృష్టం వరించింది. ఎల్లిస్ వైదొలిగిన తర్వాత ఆర్సీబీలో నడినే డి క్లెర్క్ మాత్రమే నాణ్యమైన విదేశీ ఆల్‌రౌండర్‌గా ఉంది. ఎల్లిస్ ఆర్సీబీ 2024లో టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించింది. ఎల్లిస్‌కు డబ్ల్యూపీఎల్ మొత్తంలోనూ మంచి ట్రాక్ రికార్డు ఉంది. ఈ లీగ్‌లో 6 వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన తొలి బౌలర్ ఎల్లిసే. ఈ లీగ్‌లో ఇప్పటివరకు 25 మ్యాచ్‌లు ఆడిన ఈ వెటరన్ ఆల్‌రౌండర్.. 8 హాఫ్ సెంచరీల సాయంతో 972 పరుగులు చేసి, 8.25 ఎకానమీతో 14 వికెట్లు తీసింది. డబ్ల్యూపీఎల్ 2026 ప్రారంభానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్‌కు కూడా భారీ షాక్ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్, ఆసీస్ ప్లేయరే అయిన అన్నాబెల్ సదర్‌ల్యాండ్ కూడా వ్యక్తిగత కారణాల చేత సీజన్ మొత్తానికే దూరం కానుంది. సదర్‌ల్యాండ్ స్థానాన్ని డీసీ యాజమాన్యం అలానా కింగ్‌తో భర్తీ చేసింది.



# స్పోర్ట్స్

## కోహ్లీ - రోహిత్ వీడ్కోలు సహజంగా అనిపించలేదు.. ఏదో రోజు నిజం తెలియకపోదు..!



సుదీర్ఘ ఫార్మాట్‌కు సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ వీడ్కోలు పలకడంపై ఇప్పటికీ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్వదేశంలో జూనియర్లు విఫలమవుతున్న వేళ రో–కో రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సంచలన వ్యాఖ్యలు చేశాడు. కోహ్లీ, రోహిత్ వీడ్కోలుపై తనకు సందేహాలున్నాయని ఊతప్ప అన్నాడు. ఈ ఏడాది ఇంగ్లండ్ పర్యటనకు ముందు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు టెస్టులకు అల్విదా చెప్పారు. ముందుగా హిట్‌మ్యాన్.. ఆ తర్వాత వారం రోజుల్లోనే విరాట్ సైతం 'నేనూ వైదొలుగుతున్నా' అని ప్రకటించాడు. దాంతో.. మరో రెండేళ్లు ఆడగల సామర్థ్యమున్న ఈ ఇద్దరూ ఒకరివెంట ఒకరు వీడ్కోలు పలకడం అందర్నీ షాక్‌కు గురి చేసింది. ఇదేంటీ.. ఉన్నట్టుండి రో–కో రిటైర్మెంట్ చెప్పేయడం ఏంటీ? అని అందరూ చర్చించుకున్నారు. మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సైతం వీరిద్దరి వీడ్కోలును నమ్మలేకపోతున్నాడట. మంగళవారం తన సొంత యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడుతూ "నాకెందుకో కోహ్లీ, రోహిత్ టెస్టు రిటైర్మెంట్ సహజంగా అనిపించడం లేదు. ఎవరైనా వారిని వీడ్కోలు చెప్పాలని బలవంతం చేశారా? అనేది తెలియదు. కానీ.. ఏదో రోజు నిజం బయటకు రాకపోదు. కోహ్లీ, రోహిత్ స్వయంగా తాము ఎందుకు టెస్టులకు హఠాత్తుగా వీడ్కోలు పలికామో చెబుతారని అనుకుంటున్నా. ఆస్ట్రేలియా పర్యటనలో రోహిత్ పరుగులు చేయలేదు. సో.. అతడు ఓ ఆరు నెలలు బ్రేక్ తీసుకొని ఫిట్‌నెస్ మీద దృష్టి పెడుతాడని భావించాను. ఎందుకంటే హిట్‌మ్యాన్ మళ్లీ రన్స్ కొడుతాడనే విషయంలో నాకెలాంటి సందేహం లేదు. అలాంటిది వీరిద్దరూ స్వల్ప వ్యవధిలోనే టెస్టులకు గుడ్ బై చెప్పారు. వీరిద్దరూ ఈ సంచలన నిర్ణయం ఎందుకు తీసుకున్నారో త్వరలోనే అందరికీ తెలుస్తుంది" అని ఊతప్ప అన్నాడు.

**కెప్టెన్సీ నుంచి తప్పిస్తారని**

ఆస్ట్రేలియా పర్యటనలో విఫలమైన రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పిస్తారనే వార్తలు వచ్చాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(%ఔజ%) 2025–27 సీజన్ కోసం కొత్త సారథిని నియమించేందుకు బీసీసీఐ సెలెక్టర్లు సిద్ధమవ్వడం, ఫామ్ లేమి హిట్‌మ్యాన్‌ను వీడ్కోలుకు పురిగొల్పి ఉంటాయని టాక్. 'మరి.. టెస్టులను ప్రాణంగా ప్రేమించే కోహ్లీ ఎందుకు రిటైరయ్యాడు?' అనేది ఇప్పటికీ మిలియన్ డాలర్ల ప్రశ్న. మరోసారి కెప్టెన్సీ ఆశించిన విరాట్‌కు సెలెక్టర్లు కుదరని చెప్పారని.. అందుకే అతడు టెస్టులకు బైబై చెప్పాడని అంటారు. కానీ.. అసలు వీరిద్దరు సైలెంట్‌గా వైదొలగడానికి అసలు కారణమేంటో తెలిసే రోజు కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వన్డేల్లోనే కొనసాగుతున్న రో–కో వచ్చే ఏడాది ప్రపంచకప్‌లో ఆడుతారా? లేదా? అనేది కూడా తెలియాల్సి ఉంది.




## బాక్సాఫీస్ వద్ద 'మెగా-విక్టరీ' హంగామా..
## 'మన శంకరవరప్రసాద్ గారు' నుంచి మాస్ సాంగ్ రిలీజ్!

రాబోయే సంక్రాంతికి థియేటర్లలో అసలైన పూనకాలు తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి. ఆయన ప్రధాన పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఈ చిత్రంలో వెంకటేష్ ఒక పవర్‌ఫుల్ అతిథి పాత్రలో నటిస్తుండటం విశేషం. ఈ సినిమా విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్ర యూనిట్ 'ఆర్ యూ రెడీ' అనే మాస్ పాటను విడుదల చేసింది. ప్రముఖ గీత రచయిత కాసర్ల శ్యామ్ అందించిన సాహిత్యం మాస్ ఆడియన్స్‌ను ఉర్రూతలూగిస్తోంది. "ఏంటి బాసూ సంగతీ.. అదిరిపోద్దీ సంక్రాంతీ.., ఏంటి వెంకీ సంగతీ.. ఇరగతీద్దాం సంక్రాంతీ.." అంటూ సాగే లైన్లు అభిమానుల చేత ఈలలు వేయిస్తున్నాయి. మెగాస్టార్ తన సిగ్నేచర్ స్టెప్పులతో గ్రేస్‌ను చూపిస్తుంటే, వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్ మరియు మేనరిజమ్స్‌తో పాటలో జోష్ నింపారు. పాట చిత్రీకరణలో అనిల్ రావిపూడి తనదైన కలర్‌ఫుల్ అండ్ ఎనర్జిటిక్ మార్క్‌ను చూపించారు. ఈ చిత్రంతో మెగాస్టార్ మరోసారి తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించుకోవడానికి సిద్ధమయ్యారు. వెంకటేష్ తోడవ్వడంతో ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులకు కూడా ఫుల్ మీల్స్ లాంటి విందు అని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## మిక్స్‌డ్ టాక్ నుంచి స్టడీ కలెక్షన్స్ బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకుంటున్న 'ఛాంపియన్'




ఐదు రోజుల క్రితం థియేటర్లలో విడుదలైన 'ఛాంపియన్' సినిమాకు మొదటిరోజు నుంచి ఆహా, ఓహో అనే స్థాయి టాక్ రాలేదు. అయితే "ఓ సారి హ్యాపీగా చూసేయొచ్చు" అనే డీసెంట్ స్పందనతోనే సినిమా ప్రయాణం మొదలైంది. టాక్ ఎలా ఉన్నా, బాక్సాఫీస్ వద్ద మాత్రం ఈ సినిమా తన సత్తా చాటుతోంది. విడుదలైన కొద్ది రోజులలోనే స్టడీ కలెక్షన్లతో వీర విహారం చేస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. నిజానికి ఈ సినిమాపై ముందు నుంచే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీ క్రియేట్ అయింది. అందుకు ప్రధాన కారణం స్వప్న సినిమాస్ బ్యానర్. 'మహానటి', 'జాతిరత్నాలు', 'సీతారామం' వంటి కల్ట్ చిత్రాలు అందించిన ఈ ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తున్న సినిమా కావడంతోనే మొదటి నుంచే సాలిడ్ అంచనాలు ఏర్పడ్డాయి. దీనికి తోడు టీజర్, ట్రైలర్‌లు కూడా సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. రిలీజ్ రోజున మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ, ఆ తర్వాత పరిస్థితి క్రమంగా మారింది. సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి పాజిటివ్ అభిప్రాయాలు వెల్లువెత్తడంతో వర్డ్ ఆఫ్ మౌత్ బలపడింది. అదే ప్రభావం నేరుగా బాక్సాఫీస్ కలెక్షన్లపై పడింది. రోజు గడిచే కొద్దీ థియేటర్లలో ఆక్యుపెన్సీ మెరుగుపడుతూ, సినిమాపై ఆసక్తి పెరుగుతూనే ఉంది. నాలుగు రోజుల పాటు డీసెంట్ వసూళ్లు నమోదు చేస్తూ 'ఛాంపియన్' మంచి బజ్‌ను కొనసాగిస్తోంది. మొదటి రోజు తర్వాత నెమ్మదిగా పుంజుకున్న ఈ సినిమా, రెండో రోజు నుంచి స్టడీ కలెక్షన్లు రాబట్టడం విశేషం. ఫ్యామిలీ ఆడియెన్స్‌తో పాటు యూత్ వర్గాలు థియేటర్లకు రావడం కలెక్షన్లకు బలంగా మారింది. కథలోని ఎమోషన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. మేకర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం, 'ఛాంపియన్' సినిమా ఐదు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.12.51 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. షేర్ పరంగా చూస్తే రూ.7 కోట్ల వరకు రాబట్టింది. ఈ సినిమా క్లీన్ హిట్ కావాలంటే ఇంకా సుమారు రూ.4 కోట్ల షేర్ కలెక్ట్ చేయాల్సి ఉంది. టాక్ మరింత పాజిటివ్‌గా కొనసాగితే, వీక్‌డేస్‌లో కూడా స్టడీ కలెక్షన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదే ఊపు కొనసాగితే, 'ఛాంపియన్' సేఫ్ జోన్‌లోకి వెళ్లడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.




## బిగ్గెస్ట్ డిజాస్టర్ చిత్రంగా 'వృషభ'.. నష్టం ఎన్నికోట్లు అంటే..

మలయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్‌కు ఈ ఏడాది బాగా కలిసొచ్చిందనుకుంటే.. తాజాగా విడుదలైన 'వృషభ' మూవీ తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచింది. 2025 మోహన్‌లాల్ నటించిన లూసిఫర్ (ఎంపురాన్) రూ. 268 కోట్లు, తుడరమ్ రూ. 235 కోట్లు, హృదయపూర్వం రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరాయి. కానీ, ఈ ఏడాది చివరలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'వృషభ' భారీ నష్టాలను మిగిల్చింది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదలైన 'వృషభ' మూవీ బాక్సాఫీస్ వద్ద 5రోజుల్లో రూ. 1.94 కోట్లు మాత్రమే వసూలు చేసింది. సుమారు రూ. 70 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీ దారుణమైన ఫలితాన్ని అందుకుంది. ఈ ఏడాది బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా ఈ సినిమా ఉంది. ప్రాంతాల వారిగా 5రోజుల కలెక్షన్స్ ఇలా ఉన్నాయి. ఓవర్సీస్‌లో ఈ చిత్రం దాదాపు రూ. 25 లక్షలు, మలయాళంలో రూ. 1.01 కోట్లు, హిందీలో రూ. 8 లక్షలు, తెలుగు వెర్షన్ రూ. 32 లక్షలు, కన్నడ వెర్షన్ దాదాపు రూ. 4 లక్షలు మాత్రమే సాధించింది. ఫైనల్‌గా ఈ మూవీ రూ. 65 కోట్లకు పైగానే నష్టాన్ని మిగల్చడం ఖాయంగానే కనిపిస్తుంది. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో దర్శకుడు నందకిషోర్ 'వృషభ' చిత్రాన్ని తెరకెక్కించారు. తండ్రీ కొడుకుల చుట్టూ తిరిగే జన్మజన్మల కథగా ఈ మూవీ ఉంది. కొత్తదనం లేని కథతో ప్రేక్షకులకు విసుగు తెప్పించారని విమర్శలు ఉన్నాయి. ఇందులో కేవలం మోహన్‌లాల్ నటన మాత్రమే బాగుందని ప్రశంసలు వచ్చాయి. అజయ్, అలీ, అయ్యప్ప పి.శర్మ వంటి తెలుగునటులు ఈ మూవీలో కీలక పాత్రల్లో కనిపిస్తారు.

## స్టార్ దర్శకుడితో 'కమల్ హాసన్' సినిమా.. జరిగేపనేనా..?

సినిమా రంగంలో ఏదైనా జరగవచ్చు. ఎవరు ఎవరినైనా దర్శకత్వం వహించవచ్చు. అయితే కథే ఇక్కడ ప్రధానాంశం. అది సరిగా సెట్ కాకపోవడంతోనే రజనీకాంత్ హీరోగా సుందర్.సి దర్శకత్వం వహించాల్సిన చిత్రం తెర రూపం దాల్చలేదు. తాజాగా ఒక రేర్ కాంబో గురించి వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అదేంటంటే కమలహాసన్ హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో చిత్రం రూపొందే విషయమై చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం ఉంది. కమలహాసన్ ఏ తరహా చిత్రాన్నైనా చేయగలరు. అయితే వెట్రిమారన్‌కు ఒక ముద్ర ఉంది. ఆయన చిత్రాల కథలు వెనుకబడ్డ వర్గాల ఇతి వృత్తం, నేరారోపణలకు బలైన యువత ఇతి వృత్తంతో ఉంటాయి. తాజాగా ఈయన శింబు హీరోగా అరసన్ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఉత్తర చెన్నైకి చెందిన గ్యాంగ్‌స్టర్స్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని కలైపులి ఎస్.థాను తన వి.క్రియేషన్ పతాకంపై నిర్మిస్తున్నారు. అదే విధంగా నటుడు కమలహాసన్ తాజాగా స్టంట్‌మాస్టర్ల ద్వయం అన్బరివ్‌ల దర్శతకత్వంలో నటిస్తూ, తన రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషన్ పతాకంపై నిర్మించే పనిలో బిజీగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వెట్రిమారన్ దర్శకత్వంలో కమలహాసన్ హీరోగా నటించే చిత్రం గురించి చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇందులో నిజమెంతోగానీ, ఇదే గనుక జరిగితే కచ్చితంగా వైవిధ్యభరిత కథా చిత్రం అవుతుంది.



## డ్రాగన్ కంట కన్నీరు.. సల్మాన్ ఖాన్ గల్వాన్ మూవీపై చైనా మీడియా అక్కసు!

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' టీజర్ విడుదలైనప్పటి నుంచీ సరిహద్దు అవతల చైనాలో ప్రకంపనలు మొదలయ్యాయి. డిసెంబర్ 27న సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ టీజర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తుండటంతో, చైనా అధికారిక పత్రిక 'గ్లోబల్ టైమ్స్' ఈ సినిమాపై అక్కసు వెళ్లగక్కింది. భారత సైనికుల వీరత్వాన్ని చాటిచెప్పే ఈ చిత్రాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో చైనా మీడియా తన సంపాదకీయంలో పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్ వాస్తవ సంఘటనల ఆధారంగా తీసిన సినిమా కాదని, కేవలం భారతీయుల్లో జాతీయవాదాన్ని రెచ్చగొట్టడానికి రూపొందించిన నేషనలిస్టిక్ మెలోడ్రామా అని చైనా కొట్టిపారేసింది. అంతేగాకుండా 2020 గల్వాన్ ఘర్షణల్లో భారత సైనికులే చొరబాటుకు పాల్పడ్డారని బుకాయిస్తూ.. సినిమాలో తమ సైన్యాన్ని విలన్లుగా చూపించడం సరికాదని చైనా వాదిస్తోంది. అలాగే అంతర్జాతీయ వేదికలపై చైనా సైనికుల మరణాల సంఖ్య గురించి భారత్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని గ్లోబల్ టైమ్స్ ఆరోపించింది.



# పాకిస్తాన్ కు వ్యతిరేకంగా భారత్ బిగ్ స్కెచ్

**న్యూఢిల్లీ :** భారత్?ఒమాన్ మధ్య వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు చరిత్రలో లోతుగా పాతుకుపోయాయి. చత్రపతి శివాజీ నుంచి గ్రాండ్ ముఫ్తీ వరకు సత్సంబంధాలు, మస్కట్‌లో భారతీయ వ్యాపారుల స్థిరపడడం ఈ బంధాల చిహ్నాలు. ఇటీవల డిసెంబర్ 29న ప్రారంభమైన కౌండిన్య షిప్ యాత్ర ప్రాచీన నావికా మార్గాలను పునరుద్ధరించి ఈ వారసత్వాన్ని గుర్తు చేసింది.ఇదిలా ఉంటే ప్రధాని మోదీ ఇటీవల ఒమాన్‌లో పర్యటించారు. భారత ఎగుమతులపై సుంకాలు లేకుండా ఒప్పందం చేసుకున్నారు. ఇంధన రంగం, పర్యాటకం, ప్రబల సాంకేతికతలపై 4 బిలియన్ డాలర్ల ఒప్పందాలు కుదిరాయి. ఈ ఒప్పందాలు రెండు దేశాల మధ్య వాణిజ్య బంధాలను బలోపేతం చేస్తూ భారత ఆర్థిక ప్రభావాన్ని పెంచుతాయి.ఒమాన్ సుల్తాన్ అనుమతితో డుకం ఎయిర్‌బేస్, దకం పోర్టులో భారత నౌకాదళానికి ప్రవేశం లభించింది. హిందూ మహాసముద్రంలోకి అఫ్ ఆర్మోజ్ జలసంధి సమీపంలో ఉన్న ఈ స్థావరం యుద్ధనౌకల రిపేర్లు, ఇంధన పునరునామి అవకాశాలను అందిస్తుంది. పడవల రాకపోకలపై నిఘా పెట్టే సామర్థ్యం భారత్‌కు కీలక ప్రయోజనం.చిబూటీలోని భారత స్థావరంతోపాటు డుకం ఆధారం చైనా, అమెరికా నౌకలపై పరిశీలన అవకాశాన్ని కల్పిస్తుంది. పాకిస్తాన్ గ్వాదర్ పోర్టు, ఇరాన్ చాబహార్ పోర్టులకు సమీపంలో ఉండటం వల్ల అచేబియా జలాల్లో శత్రు కదలికలు గమనించవచ్చు. డుకం?చాబహార్ సమీకరణం ప్రాంతీయ ఆధిపత్యానికి బలమైన స్థాపన.ఒమాన్‌తో భారత్ సైనిక వ్యాసాలు ఏటా





జరుగుతాయి. 'నసీముల్ బహార్' పేరిట నౌకా దళాలు, ఈస్టర్న్ బ్రిడ్జి వద్ద వాయుసేనలు, భూసైన్యాల మధ్య శిక్షణలు ప్రాంతీయ భద్రతకు బలం చేకూరుస్తాయి. రస్సెల్ హగ్‌లోని సిగ్నలింగ్ పోస్ట్ ఆఫ్ ఆర్మోజ్ ద్వారా 30% ప్రపంచ ఆయిల్ రవాణాపై నియంత్రణ పొందవచ్చు.పాక్‌కు డుకం ఒప్పందం తీవ్ర దెబ్బ. అరబియా సముద్రంలో భారత పటిష్ఠం పెరగడం వల్ల గ్వాదర్ ప్రభావం తగ్గుతుంది. ఒమాన్‌తో భారత్‌కు ఉన్న చారిత్రక విశ్వాసం ప్రాంతీయ రాజకీయాల్లో కొత్త సమతుల్యతను తీసుకొస్తుంది.

# రాజకీయాల్లో చిత్ర విచిత్రమైన ఘటనలు

**ముంబై :** మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల వేళ ఆ రాష్ట్ర రాజకీయాల్లో చిత్ర విచిత్రమైన ఘటనలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల కోసం బీజేపీకి షాకిస్తూ శరద్ పవార్, అజిత్ పవార్ ఒక్కటి కావడం.. దేశవ్యాప్తంగా తీవ్ర ఆసక్తికరంగా మారింది. మరోవైపు.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవడమే లక్ష్యంగా ఓ నాయకుడు ఏకంగా 3 పార్టీలు మారారు. అయితే అది కూడా కేవలం ఎనిమిది రోజుల వ్యవధిలోనే కావడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. థానే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఈ ఆసక్తికర ఉదంతం వెలుగులోకి వచ్చింది.నేరచరిత్ర కలిగిన మయూర్ షిండే అనే వ్యక్తి.. కేవలం 8 రోజుల వ్యవధిలోనే 3 రాజకీయ పార్టీల జెండాలు మార్చేశారు. డిసెంబర్ 22వ తేదీ వరకు ఏకనాథ్ షిండే నేతృత్వంలోని షిండే శివసేన పార్టీలో ఉండేవారు. అయితే థానే మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో.. డిసెంబర్ 23వ తేదీన బీజేపీ మహారాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర చవాన్ సమక్షంలో కమలం పార్టీలో చేరారు.సావర్కర్ నగర్ (వార్డు నంబర్ 14) నుంచి బీజేపీ తరఫున తనకు టికెట్ వస్తుందని ఆశించినప్పటికీ భంగపాటే ఎదురైంది. బీజేపీలో మయూర్ షిండేకు నిరాశ ఎదురవడంతో.. నామినేషన్ల చివరి రోజైన డిసెంబర్ 30వ తేదీన హుటాహుటిన అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎట్టకేలకు ఎన్సీపీ తరఫున ఆయనకు అభ్యర్థిత్వం ఖరారైంది.

అయితే మయూర్ షిండేపై అనేక తీవ్రమైన నేరాలు ఉండటం గమనార్హం. హత్య, హత్యాయత్నం, దోపిడీ వంటి అనేక



కేసులు ఉండటంతోపాటు.. గతంలో మకోకా (ఎంసీఓసీఏ) చట్టం కింద కూడా విచారణను ఎదుర్కొన్నారు. గతంలో ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన కీలక నేత సంజయ్ రౌత్‌ను బెదిరించిన కేసులో మయూర్ షిండే అరెస్ట్ కూడా అయ్యారు. కాగా.. థానే మున్సిపల్ కార్పొరేషన్‌లోని 131 స్థానాలకు జనవరి 15వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 40 స్థానాల్లో.. షిండే శివసేన 87 స్థానాల్లో పోటీ చేస్తుండగా.. కాంగ్రెస్, అజిత్ పవార్ ఎన్సీపీ స్వతంత్రంగానే బరిలోకి దిగుతున్నాయి.

# డాన్ ఇంట నగదు... వజ్రాలే... వజ్రాలు

**ఛండీఘడ్ :** ఢిల్లీ-ఎన్సీఆర్‌లో అండర్ వరల్డ్ డాన్ ఇందర్జీత్ సింగ్ యాదవ్, అతని అనుచరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహించింది. ఈ దాడుల్లో లెక్కల్లో చూపని నగదు 5 కోట్ల రూపాయలకు పైగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో పాటు సుమారు 8 కోట్ల రూపాయల విలువైన బంగారం, వజ్రాల నగలున్న సూట్‌కేస్, 35 కోట్ల రూపాయల విలువైన ఆస్తుల పత్రాలు దొరికాయి. మొత్తం కలిపి సుమారు 48 కోట్ల రూపాయల ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు.ఈ సోదాలు మంగళవారం మొదలై బుధవారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. అక్రమంగా సంపాదించిన డబ్బును లెక్కించడానికి బ్యాంక్ అధికారులను, కరెన్సీ నోట్లను లెక్కించే యంత్రాన్ని కూడా పిలిపించారు. రాజకీయ అండతో ఇందర్జీత్ సింగ్ యాదవ్ బెదిరించి డబ్బులు వసూలు చేశాడని, ఈ డబ్బుతోనే అక్రమాలకు పాల్పడ్డాడని అధికారులు తెలిపారు. యాదవ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతను యూఏఈకి పారిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు.హరియాణాకు చెందిన ఇందర్జీత్ సింగ్ యాదవ్ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. అతడు యూఏఈ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండేవాడు.




ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో డిసెంబర్ 30న దిల్లీలోని సర్వప్రియా విహార్‌లో ఉన్న ఇందర్‌జిత్ సన్నిహితుడి నివాసంలో ఈడీ సోదాలు మొదలుపెట్టింది. భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు గుర్తించింది." ఇందర్జీత్ సింగ్ యాదవ్ అక్రమంగా బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ప్రైవేట్ ఫైనాన్షియర్ల నుండి బలవంతంగా డబ్బులు తీసుకోవడం, ఆయుధాలతో బెదిరించడం, ఇలాంటి అక్రమ కార్యకలాపాల ద్వారా డబ్బు సంపాదించడం వంటి వాటిపై మనీ లాండరింగ్ కేసు నమోదు చేశాం" అని ఈ కేసు విచారణలో ఉన్న ఒక సీనియర్ అధికారి చెప్పారు.యాదవ్, అతని అనుచరులపై హర్యానా, యూపీ రాష్ట్రాల్లో 15కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆయుధాల చట్టం, ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి, ఛార్జిషీట్లు కూడా దాఖలు చేశారు. ఈడీ దాడుల్లో బయటపడిన ఆస్తుల విలువ చాలా ఎక్కువగా ఉండటంతో, ఈ కేసు మరింత తీవ్రంగా మారింది. యాదవ్ అక్రమ సంపాదన వెనుక ఉన్న పెద్ద నెట్‌వర్క్‌ను ఈడీ అధికారులు బయటపెట్టే పనిలో ఉన్నారు.

## ఆపరేషన్ సిందూర్ తో డీఆర్డీవో ఆయుధాల సత్తా ఏంటో అందరికీ తెలిసింది

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) 68వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంస్థ సేవలను కొనియాడారు. ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో డీఆర్డీవో అభివృద్ధి చేసిన ఆయుధ వ్యవస్థలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయని, మన దేశీయ ఆయుధాల సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసిందని అన్నారు. ఇది సంస్థ నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. గురువారం ఢిల్లీలోని డీఆర్డీవో ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన 'సుదర్శన చక్ర' రూపకల్పనలో డీఆర్డీవో కీలక పాత్ర పోషించనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం కింద దేశంలోని కీలక సంస్థాపనలకు పూర్తిస్థాయి వైమానిక రక్షణ కల్పించే బాధ్యతను డీఆర్డీవోకు అప్పగించినట్లు తెలిపారు. ఆధునిక యుద్ధంలో ఎయిర్ డిఫెన్స్ ప్రాముఖ్యతను ఆపరేషన్ సిందూర్ సమయంలో చూశామని, ఈ లక్ష్యాన్ని డీఆర్డీవో త్వరగా సాధిస్తుందని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో, సాయుధ బలగాలకు అత్యాధునిక సాంకేతికతను అందించడంలో డీఆర్డీవో చేస్తున్న కృషి అమోఘమని అన్నారు. డీఆర్డీవో శాస్త్రవేత్తల అచంచలమైన నిబద్ధత, శాస్త్రీయ నైపుణ్యం దేశ రక్షణ సన్నద్ధతకు మూలస్తంభాలని పేర్కొన్నారు.

ప్రైవేట్ రంగం, విద్యాసంస్థలు, స్టార్టప్‌లతో కలిసి పనిచేయడం ద్వారా దేశంలో ఒక బలమైన రక్షణ పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతోందని అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆవిష్కరణలపై దృష్టి సారిస్తూ, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింత పెంచే మార్గాలను అన్వేషించాలని ఆయన సూచించారు. నిరంతరం నేర్చుకుంటూ, భవిష్యత్ టెక్నాలజీలకు అనుగుణంగా సన్నద్ధంగా ఉండాలని డీఆర్డీవో శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు.

## ఫాస్టాగ్‌లపై కేంద్రం శుభవార్త... వాహనదారులకు భారీ ఊరట

జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కార్లు, జీపులు, వ్యాన్‌లకు సంబంధించిన ఫాస్టాగ్‌ల కోసం 'నో యువర్ వెహికల్' ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ గురువారం ప్రకటించింది. ఈ కొత్త నిబంధన ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది వాహనదారులకు పెద్ద ఊరట లభించనుంది. ఫాస్టాగ్ యాక్టివేట్ అయిన తర్వాత కేవైవీ పేరుతో ఎదురవుతున్న ఇబ్బందులు, జాప్యాన్ని నివారించేందుకే ఈ సంస్కరణ తీసుకొచ్చినట్లు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు ఉన్నప్పటికీ, కేవైవీ అప్‌డేట్ కాలేదన్న కారణంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, తాజా నిర్ణయంతో ఆ సమస్యలు తొలగిపోతాయని పేర్కొంది. కొత్త ఫాస్టాగ్‌లకే కాకుండా, ఇప్పటికే జారీ చేసిన ఫాస్టాగ్‌లకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. అయితే, ఫాస్టాగ్ దుర్వినియోగం, తప్పుగా జారీ చేయడం వంటి నిర్దిష్ట ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కేవైవీ అవసరమవుతుందని చీనాా× స్పష్టం చేసింది. ఎలాంటి ఫిర్యాదులు లేని పాత ఫాస్టాగ్‌లకు కేవైవీ తప్పనిసరి కాదు. వినియోగదారులకు ప్రక్రియను సులభతరం చేస్తూనే, వ్యవస్థలో పారదర్శకత, కచ్చితత్వాన్ని పెంచేందుకు చీనాా× చర్యలు చేపట్టింది. ఇకపై ఫాస్టాగ్ యాక్టివేషన్‌కు ముందే వాహన్ డేటాబేస్ నుంచి వాహన వివరాలను ధృవీకరించుకోవాలని బ్యాంకులకు కఠిన నిబంధనలు విధించింది. ఒకవేళ వాహన్ పోర్టల్‌లో వివరాలు లేకపోతే, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (=జ) ద్వారా సరిచూసుకున్న తర్వాతే ఫాస్టాగ్‌ను యాక్టివేట్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో విక్రయించే ఫాస్టాగ్‌లకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. ఈ మార్పులతో వెరిఫికేషన్ బాధ్యత పూర్తిగా బ్యాంకులపైనే ఉంటుందని, వినియోగదారులకు ఇబ్బందులు లేని ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యమని చీనాా× తెలిపింది.

## అత్యాధునిక హంగులతో వందే భారత్ స్లీపర్..

దేశంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పరుగులకు సిద్ధమైంది. ఈ రైలుకు సంబంధించిన తొలి రూట్‌ను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు అధికారికంగా ప్రకటించారు. అస్సాంలోని గువాహటి నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలు నడవనుందని ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఈ రైలు టెస్టింగ్, సర్టిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ ఈ సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ఇటీవల కోటా-నాగ్దా సెక్షన్‌లో నిర్వహించిన ఫైనల్ ట్రయల్ రన్‌లో ఈ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో విజయవంతంగా దూసుకెళ్లింది. ఈ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉండగా.. ఇందులో 11 థర్డ్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, ఒక ఫస్ట్ ఏసీ కోచ్ ఉన్నాయి. ఒకేసారి మొత్తం 823 మంది ప్రయాణించేలా దీనిని రూపొందించారు. వ్యాపారవేత్తలు, కుటుంబాలు, విద్యార్థులతో పాటు పర్యాటకులకు ఈ రాత్రిపూట ప్రయాణం (ఓవర్‌నైట్ జర్నీ) ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. టికెట్ ధరల విషయానికొస్తే.. ఆహారంతో కలిపి థర్డ్ ఏసీకి సుమారు రూ. 2,300, సెకండ్ ఏసీకి రూ. 3,000, ఫస్ట్ ఏసీకి రూ. 3,600గా ఉండనున్నట్లు సమాచారం. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ ఈ రైలును తీర్చిదిద్దారు. ఎర్గోనామిక్ బెర్తులు, ఆటోమేటిక్ డోర్లు, అత్యాధునిక లైటింగ్, శబ్దం రాకుండా ప్రత్యేక చర్యలు, కవచ్ యాంటీ కొలిజన్ సిస్టమ్ వంటి ఆధునిక హంగులు ఇందులో ఉన్నాయి. వరల్డ్ క్లాస్ సౌకర్యాలతో కూడిన ఈ వందే భారత్ స్లీపర్.. రాత్రి ప్రయాణాల్లో ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుందని రైల్వే శాఖ తెలిపింది.

## రికార్డు స్థాయిలో జీఎస్టీ ఆదాయం... డిసెంబరులో భారీ వసూళ్లు

దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని సూచిస్తూ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకమైన వృద్ధిని నమోదు చేశాయి. 2025 డిసెంబరు నెలలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,74,550 కోట్ల ఆదాయం సమకూరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. 2024 డిసెంబరులో నమోదైన రూ.1,64,556 కోట్లతో పోలిస్తే ఇది 6.1 శాతం అధికం కావడం గమనార్హం. పండుగల సీజన్ తర్వాత కూడా దేశంలో ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్నాయనడానికి ఈ గణాంకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

డిసెంబర్ నెల వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ (జ+ూు) వాటా రూ.34,289 కోట్లు కాగా, స్టేట్ జీఎస్టీ (ూ+ూు) వాటా రూ.41,368 కోట్లుగా ఉంది. ఇక ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (×+ూు) ద్వారా అత్యధికంగా రూ.98,894 కోట్లు వసూలయ్యాయి. రుణ బకాయిల చెల్లింపుల కోసం తాత్కాలికంగా కొనసాగిస్తున్న జీఎస్టీ పరిహార సెస్ రూపంలో ప్రభుత్వానికి మరో రూ.4,551 కోట్లు అందాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఈ సెస్ ద్వారా మొత్తం రూ.88,385 కోట్లు వసూలయ్యాయి. మరోవైపు, డిసెంబరులో జీఎస్టీ రిఫండుల రూపంలో రూ.28,980 కోట్లను ప్రభుత్వం వెనక్కి చెల్లించింది. కొన్ని విలాసవంతమైన వస్తువులపై 40 శాతం వంటి కొత్త పన్నుల శ్లాబులు ప్రవేశపెట్టినప్పటికీ, పొగాకు, పాన్ మసాలా వంటి వాటిపై సెస్ కొనసాగుతోంది. సెప్టెంబర్ 22 నుంచి కొన్ని వస్తువులపై పన్ను రేట్లు తగ్గించినప్పటికీ, వినియోగదారుల నుంచి డిమాండ్ పెరగడం వల్ల వసూళ్లు పెరగడం విశేషం.

**పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానం**

ఇదే సమయంలో, పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం పలు నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇటీవలి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందిన సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) చట్టం-2025 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ చట్టం పొగాకు ఉత్పత్తులపై కొత్త ఎక్సైజ్ సుంకం రేట్లను నిర్దేశిస్తుంది. దీనితో పాటు, పాన్ మసాలా తయారీపై సెస్ విధించే హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ యాక్ట్, 2025 కూడా అదే తేదీ నుంచి అమల్లోకి రానుంది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137